తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# 1400 సిమెంట్ బస్తాలు మాయం!

### -హౌసింగ్ ఈఈ మోహన్‌రావు తనిఖీలో వెల్లడి

సత్యవేడు, డిసెంబరు 27 ప్రభాతవార్త: సత్యవేడు హౌసింగ్‌శాఖలో రూ॥3,78,000/-లు విలువచేసే సిమెంట్ బస్తాలు మాయమయ్యాయి. గూడూరు హౌసింగ్‌శాఖ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్ మోహన్‌రావు బుధవారం నిర్వహించిన తనిఖీల్లో ఈవిషయం బట్టబలైంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్రంలో అధికార వైకాపా ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇంటి స్థలాలతో పాటుగా ప్రభుత్వ పక్కాఇళ్ళను మంజూరు చేయడం జరిగింది. ఇందుకు సంబంధించి రెండేళ్ళక్రితం జగన్నకాలనీలు ఏర్పాటు చేసి లబ్ధిదారులతో ఇళ్ళ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఈనేపథ్యంలో గృహనిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు అవసరమైన సిమెంట్, స్టీలు ప్రభుత్వం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే సత్యవేడు హౌసింగ్‌శాఖలో గృహనిర్మాణాల ముసుగులో వందలాది సిమెంట్‌బస్తాలు దారిమల్లినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇక్కడ హౌసింగ్‌శాఖ ఏఈగా పనిచేస్తూ రెండు నెలల క్రితమే పదవీ విరమణ పొందిన వెంటకసుబ్బయ్య విదుల్లో ఉన్నప్పుడే సిమెంట్‌బస్తాలు మాయమైనట్లు ఆరోపణలు వచ్చాయి. ఈక్రమంలో రిటైర్డ్ అయిన వెంకటసుబ్బయ్య హౌసింగ్ శాఖకు సంబంధించిన రికార్డులను ప్రస్తుతం ఇన్‌ఛార్జ్ ఏఈగా పనిచేస్తున్న సుబ్రమణ్యంకు అప్పగించగా దొంగాటాడుతూ వచ్చారు. ఈనేపథ్యంలో హౌసింగ్ ఈఈ మోహన్‌రావు సత్యవేడు హౌసింగ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రిటైర్డ్ ఏఈ వెంకటసుబ్బయ్య నేరుగా అక్కడకు చేరుకుని రికార్డులను అధికారులకు అప్పగించారు. దీనిపై పూర్తిస్థాయిలో పరిశీలించిన అధికారులు ఇక్కడ 1400 సిమెంట్ బస్తాలు గోడౌన్ చేరకనే దారిమల్లించినట్లు గుర్తించారు. వాటి విలువ రూ॥3,78000/-లు ఉంటుందని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులు సమర్పించి, వారి ఉత్తర్వులు మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

### మోకాళ్ల మీద నిలబడి...
# నిరసన తెలిపిన కార్మికులు



మోకాళ్ళ మీద నిల్చుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

వెంకటగిరి, డిసెంబర్ 27 ప్రభాతవార్త : మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారానికి రెండవ రోజుకు చేరింది. మోకాళ్ళ మీద నిలబడి మున్సిపల్ కార్మికులు నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డీపల్లి చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పర్మినెంట్ చేసి మాట నిలబెట్టుకోవాలని అన్నారు. మున్సిపల్ కార్మికుల్ని కాకుండా ఇతర డిపార్ట్మెంట్లలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ ఉద్యోగులుగా చేశారని అన్నారు. ఉద్యోగులుగా నమోదు చేసినందుకు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు వీరికి అందడం లేదని ఎగిరిపోయాయని అన్నారు. ముఖ్యమంత్రి నవరత్నాలు ప్రారంభిస్తూ పారిశుద్ధ్య కార్మికులకు ఆదాయంతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు వర్తింప చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఈ హామీను కూడా తుంగలో తొక్కడం జరిగిందని అన్నారు. ఈ హామీను కూడా తుంగలో తొక్కడం జరిగిందని అన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని అన్నారు. లేదంటే సమ్మెను ఉదృత్తం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వెంకటగిరి ప్రాజెక్టు అధ్యక్షురాలు ఏ మంజుల, మండల అధ్యక్షురాలు వి. సుభాషిని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు పట్టణ అధ్యక్షులు టి.సుబ్బయ్య, కార్యదర్శి ఎస్.ప్రసాద్, మున్సిలప్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గూడూరులో సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు

గూడూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త : మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు అన్నారు. గూడూరులో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మున్సిపల్ పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె బుధవారానికి రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. చాలీచాలని జీతాలతో నిరవధిక సమ్మెలు చేసునతన్న కార్మికులను పక్కనపెట్టి ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమాలకు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారని విమర్శించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఊరూవాడా శుభ్రం చేస్తూ ప్రజలందరి ఆరోగ్యం కాపాడుతున్నా కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. నిరవధిక సమ్మె చేస్తున్న శిబిరం వద్దకు కాంగ్రెస్ పార్టీ తిరుపతి డిసిసి అధ్యక్షులు పంట శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి ఇన్‌ఛార్జి పూల చంద్రశేఖర్, స్టేట్ కోఆర్డినేటర్ రాపూరు బ్రహ్మయ్య, గూడూరు నియోజకవర్గ ఛైర్మన్ గుంటమడుగు సుబ్బరామరాజు, సెక్రటరి వేమయ్య తదితర నాయకుల బృందం వచ్చి సంఘీభావం తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య, మున్సిపల్ జిల్లా కార్యదర్శి బి.గోపినాథ్, శ్రామిక మహిళా సంఘం అధ్యక్షురాలు బి.ప్రభావతి, కార్యదర్శి ఎం.సంపూర్ణమ్మ, మురళి, బి.రమేష్, దారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### జనవరి 1న షార్ నుంచి పిఎస్ఎల్‌వి సి-58...
# రాకెట్ ప్రయోగం

**- 480 కిలోల ఎక్స్‌పో శాట్‌తో పాటు ఒక కేజి బరువు ఉన్న విఐవై శాట్ - ప్రయోగ వీక్షణకు సందర్శకులను ఆహ్వానించిన ఇస్రో**

శ్రీహరికోట (తడ), డిసెంబర్ 27 ప్రభాతవార్త : అంతరిక్ష పరిశోధనలో అగ్రరాజ్యాలకు ధీటుగా దూసుకు పోతున్న ఇస్రో 2024 జనవరి1న మరో కీలక ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమైంది. శ్రీహరికోట లోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి పిఎస్ఎల్‌వి సి-58 రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. దీని ద్వారా 480 కిలోల బరువు ఉన్న ఎక్స్‌పో శాట్‌ను, కేరళ యూనివర్శిటీ విద్యార్థులు రూపొందించిన ఒక కేజి బరువు ఉన్న విఐవై శాట్‌ను ప్రయోగిస్తున్నారు. గత ఏడాది వరుసగా ఎనిమిది రాకెట్ల ప్రయోగాలు శ్రీహరికోట నుంచి శాస్త్రవేత్తలు విజయవంతంగా చేపట్టారు. 2024 కూడా సక్సెస్‌తో ఈ రాకెట్‌ను గురి తప్పకుండా విడిచిపెట్టాలని ఆశిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇస్రో సందర్శకులను ఆహ్వానించింది. ఆన్‌లైన్ ద్వారా షార్‌లోని విజిటర్స్ గ్యాలరీ నుంచి వీక్షకులను దరఖాస్తులు ఆహ్వానించింది. ఇదిలా వుంటే ఐదేళ్ల జీవిత కాలం కలిగిన ఎక్స్‌పో శాటిలైట్ ఒక విభిన్నమైనది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎక్స్ కిరణాల ధ్రువనాన్ని అధ్యయనం చేయడం కోసం దీన్ని రూపొందిం చింది. బెంగళూరులోని యుఆర్‌రావు శాటిలైట్ సెంటర్లో తయారు చేసిన ఈ ఉపగ్రహాన్ని ఇప్పటికే శ్రీహరికోటకు తీసుకొచ్చి రాకెట్లో అనుసంధానం పనులు చేపట్టారు. భూమికి 650 కిలోమీటర్ల తక్కువ దూరంలో పిఎస్ఎల్‌వి సి-58 రాకెట్ ఈ ఉపగ్రహాన్ని విడిచిపెట్టేలా ప్రణాళికలు రూపొందించారు. టెలిస్కోప్‌లాగా పనిచేసే ఈ ఉపగ్రహ సేవలు మన దేశానికి ఎంతో ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పిఎస్ఎల్‌వి సి-58 రాకెట్ ప్రయోగం తర్వాత ఆ వెంటనే జిఎస్ఎల్‌వి మార్క్2 ప్రయోగాన్ని కూడా ఇస్రో చేపట్టనుంది.



షార్ నుంచి ప్రయోగించనున్న పిఎస్ఎల్‌వి సి-58 రాకెట్



స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎక్స్‌పో శాటిలైట్

### అక్రమ నిర్మాణాలను అడ్డుకోని...
# రెవెన్యూ అధికారులు



రామచంద్రాపురం గ్రామంలో జరుగుతున్న అక్రమ కట్టాడాలు

తొట్టంబేడు, డిసెంబర్ 27 ప్రభాతవార్త :మండలంలోని రామచంద్రాపురం గ్రామ సర్వే నంబర్ 90/1లో 1.48 ఎకరాల్లో ఇంటిస్థలాలు 145 సెక్షన్ అమలులో ఉందని అయినా ఇక్కడ యథేచ్ఛగా ఇంటి నిర్మాణాలు చేపడుతు న్నారని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఈసందర్భంగా మథర్ థెరీస్సా మహిళా మండలి నిర్వాహకులు మాట్లాడుతూ ఈస్థలంపై ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు శ్రీకాళహస్తి ఒఎస్.364-2023 పెండింగ్‌లోఉందని లోకాయుక్త కేసు 29-2017-బి2, హ్యూమన్‌రైట్స్ కమిషన్ ఉత్తర్వులు నంబర్ 160/2011 ఉత్తర్వులు ఉన్నా మరియు కేసులు జరుగు తున్నా భూ ఆక్రమణ దారులు కొందరు ఈనెల 26 నుంచి 90/1లో ప్రవేశించి పక్కా భవనాలు నిర్మిస్తున్నారని కొందరు ఫెన్సింగ్ వేసి గత నెలలో ఆక్రమించారని తెలిపారు. ఈవివరాలను సంబంధిత తహశీల్దార్‌కు విన్నవించినా విఆర్ఓలు ఇలా వచ్చి అలా వెళ్ళిపోయారని దీంతో ఆక్రమణ దారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడ కొందరు పాత్రికేయుల పేరుతో అక్రమ కట్టాడాలు నిర్మిస్తూ ఇతరులను ప్రోత్సహిస్తూన్నారన్నారు. ఇక్కడ గతంలో తహశీల్దార్‌గా పనిచేసిన రేణుకాదేవి ఇక్కడ తగాదాలను గుర్తించి 145 సెక్షన్ అమలు చేశారని అయితే దీన్ని అతిక్రమించి కట్టడాలు నిర్మిస్తున్నా పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించు కోలేదన్నారు. గ్రామంలో నిరుపేదలు ఎంతో మంది ఉన్నా ఇక్కడి స్థలాన్ని పిఎసిఎస్ పెట్రోలు బంకుకు స్థలాన్ని ఇవ్వడం, ఇక్కడే సబ్ ట్రెజరీ కార్యాల యం, పాఠశాల భవనం నిర్మించడం తమకు ఇంటిస్థలాలు లేకపోవడమే చేశారన్నారు. దీనిపై కోర్టు ఉత్తర్వులు ఉన్నా రెవెన్యూ అధికారులు లెక్కచేయక నిర్మాణాలు చేపట్టడం కోర్టు దిక్కారం అని పేర్కొన్నారు. ఇకనైనా జిల్లా అధికారులు వెంటనే స్పందించి తమ గ్రామంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు అరికట్టాలని వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### భక్తి శ్రద్ధలతో శివయ్య...
# జన్మ నక్షత్ర అభిషేకాలు
### -విశేష సంఖ్యలో భక్తుల దర్శనాలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 27 ప్రభాతవార్త :శ్రీకాళహస్తీశ్వరాలయంలో భోళాశంకరుని జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వెలసిన మూలవిరాట్టుకు విశేష అభిషేకాలు అలంకారాలు జరిపారు. శివయ్య జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా ఆలయంలో బుధవారం వేకువ జాము నుంచి విశేష కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జాము 3గంటల నుంచే దర్శనానికి అనుమతించారు. గోపూజ జరిపి జేగంట, శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి సర్వదర్శనానికి అనుమతించారు. సూర్యోదయానికి ముందు స్వామి గర్భగుడిలో మూల విరాట్టుకు ముందు ఉద్దిపిండితో తయారు చేసిన శివలింగాన్ని ప్రతిష్టించారు. ఆ లింగానికి స్థానిక ఆచారం మేరకు శాస్త్రోక్తంగా నేయ్యితో అభిషేకం జరిపారు. విశేష అభిషేకాన్ని తిలకించుటకు స్థానిక భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ధనుర్మాసం కావటంతో వేకువ జాము నుంచి పట్టణ నలుమూలల నుంచి మహిళలు విశేష సంఖ్యలో పాల్గొంటారు. బుధవారం స్వామి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు మహాశివరాత్రిలా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి ఫుల్ అడిషనల్ చార్జిగా ఉన్న ఇఓ కె.యస్, రామారావు ఆదేశాలతో స్థానిక ఎఇఓలు ధనపాల్, సతీష్‌మాలిక్, డెప్యూటీ ఇఓ వెంకట సుబ్బయ్య, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున భక్తులు హాజరై ఉత్సవాల్ని తిలకించారు. తరువాత ఆలయంలోని నటరాజ స్వామి ఆలయం ఎదురుగా విశేష సంఖ్యలో షోడషాభిషేకాలు నిర్వహించారు. సూరి గురుకుల్ సారథ్యంలో అభిషేకాలు జరిపారు. అంతకు ముందు అక్కడ హోమాలు నిర్వహించారు. ఆలయ గురుకుల్ డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ శాస్త్రోక్తంగా పూజలు హోమాలు నిర్వహించారు. కలశాల్లోని నీటితో అభిషేకాలు జరిపారు.





శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అభిషేకాలకు నీటిని కాస్తున్న దృశ్యం-విశాలంకరణలో నటరాజస్వామి

**గ్రామోత్సవం:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే ఆరుద్ర సందర్భంగా నటరాజస్వామికి అభిషేకాలు నిర్వహించిన తరువాత గ్రామోత్సవం నిర్వహించటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పట్టణంలో నటరాజస్వామిని అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. సరికొత్త తరహాలో డమురకాలు వాయిస్తూ పట్టణంలోని వీధులు దద్దరిల్ల జేసారు. ఊరేగింపుతో పాటు ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్ పాల్గొన్నారు. ఉత్సవం అంగ రంగ వైభవంగా మేళ తాళాలు మంగళవాయిద్యాలతో నాలుగుమాడావీధుల్లో సాగింది. ఆరుద్ర సందర్భంగా అభిషేక సేవలు రద్దు అయ్యాయి. అయితే రాహుకేతుదోష నివారణ పూజలు మాత్రం యథాతథంగా జరిగాయి. అభిషేక సేవల్లో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# సమరశంఖం పూరించనున్న 'చంద్రన్న'

**- అధికారంలో రావడమే ధ్యేయం - కుప్పంలో లక్ష మెజార్టీ సాధనే లక్ష్యం !!**
**- ప్రజల్లో చైతన్యం.. పార్టీ శ్రేణులకు హితోపదేశం !! - నేటి నుంచి కుప్పంలో తెదేపా అధినేత చంద్రబాబు పర్యటన !!**



కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త :మరో నాలుగు నెలల్లో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని మరలా అధికారంలో తీసుకురావడమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుప్పంలో ఎన్నికల సమరశంఖాన్ని పూరించనున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు వాకిలి తలుపు తట్టి మరలా శాసనసభలో అడుగుపెట్టాలనే దృఢ నిశ్చయంతో ముందుకు సాగుతున్నారు. 72 ఏళ్ల వయసులోను 'నవయువకుడి'లా పార్టీని అధికారంలో తేవాలని రాజకీయ అపర చాణక్యుడిగా ఖ్యాతిగాంచిన చంద్రబాబు అహర్నిశలు పార్టీ కోసం కష్టపడుతూ పార్టీ శ్రేణులను ఎన్నికల యుద్ధానికి సన్నద్ధం చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. మరోపక్క అధికార వైఎస్సార్సీ పాలనపై నిప్పులు చెరుగుతూ ప్రజల్లో చైతన్యం తేవాలని కృత నిశ్చయంతో ముందుకుసాగుతున్నారు. ఎన్నికల గడువు సమీపిస్తున్న తరుణంలో కుప్పంలో ఈసారి చంద్రబాబు పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. కుప్పంలో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష మెజార్టీ సాధనే లక్ష్యంగా ఎన్నికల ప్రచారంకు శ్రీకారం చుట్టనున్నారు. తన మూడు రోజుల పర్యటనలో భాగంగా బహిరంగసభలు, రోడ్‌షోలు నిర్వహిస్తారు. అలాగే పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు జరపనున్నారు.

**సూపర్ సిక్స్ పథకాలు.. భవిష్యత్తు గ్యారెంటీ :**

తెదేపా,జనసేన ప్రభుత్వం అధికారంలో రాగానే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలు, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలను తన పర్యటనలో భాగంగా అధినేత చంద్రబాబునాయుడు ప్రజల్లో మరింత విస్తృతంగా తీసుకెళ్లబోతున్నారు. మహాశక్తి, అన్నదాత పథకం, యువగళం , బిసిలకు రక్షణ చట్టం, ఇంటింటికీ మంచినీరు, పూర్ టు రిచ్ పథకాలపై ప్రజల్లో ఆసక్తి పెంచేలా చంద్రబాబు ప్రసంగించనున్నట్లు సమాచారం. మరో పక్క ఈ పథకాలతో మహిళలు, యువతులు, రైతులు, నిరుద్యోగులు, బిసి వర్గాలు, పేదలకు మంచి జరుగుతుందని ఆ పథకాలతో కలిగే లబ్ధిని ప్రజలకు వివరించి వారు తెదేపాకు మద్దతు పలికేలా పార్టీ శ్రేణులకు తగు సూచనలు ఇవ్వనున్నారు.

**ప్రజలు మమేకం...కార్యకర్తలతో భేటీకి ప్రాధాన్యత :**

కుప్పం పర్యటనలో భాగంగా తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అటు నియోజకవర్గ ప్రజలతో మమేకం, ఇటు కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. బహిరంగసభలతో పాటు గ్రామాల్లో చంద్రబాబు రోడ్‌షో నిర్వహిస్తారు. అలాగే కార్యకర్తల సాధక బాధలు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటుచేయించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు తెదేపా శ్రేణులతో పాటు జనసేన కార్యకర్తలను సైతం సన్నద్ధం చేయనున్నారు. కుప్పంలో జనసేన పార్టీ శ్రేణులతో సైతం చంద్రబాబు సమావేశం జరుపుతారు. పార్టీలో నేతల మధ్య సమన్వయ లోపం లేకుండా కలసికట్టుగా పనిచేసేలా అధినేత చంద్రబాబు పార్టీ శ్రేణులకు హితబోధ చేయనున్నారు. ఏది ఏమైనా ఎన్నికలకు ముందు తాను 35 ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో తెదేపా అధినేత చంద్రబాబు పర్యటిస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

# తూతూ మంత్రంగా ఉపాధి సామాజిక తనిఖీలు

**- రూ.10.67 కోట్ల పనులు, రికవరీ రూ.30 వేలు**



బంగారుపాళ్యం, డిసెంబర్ 27 ప్రభాతవార్త: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలు తూతూ మంత్రంగా నిర్వహించారు. పనులు కోట్ల రూపాయల్లో జరుగగా కేవలం వేలల్లో మాత్రమే రికవరీ సామాజిక తనిఖీ బృంద సభ్యులు బట్టబయలు చేశారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం అధికారులు నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 10.67 కోట్ల రూపాయల విలువైన పనులు చేయగా ఈ పనులను పరిశీలించిన సామాజిక తనిఖీ బృంద సభ్యులు కేవలం 30 వేల రూపాయలు మాత్రమే రికవరీ చూపింది. ఇందులో ఉపాధి హామీ పథకం కింద 2,709 పనులను 6.77 కోట్ల రూపాయలతో చేప ట్టారు. అలాగే పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 48 పనులకు గాను 3.90 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ పనుల్లో కేవలం 4,400 రూపాయలు మాత్రమే రికవరీకి సిఫార్సు చేశారు. అలాగే హౌసింగ్ పనుల ద్వారా కూలీలకు అదనంగా రూ.27 వేలు చెల్లించాలని ఈ మొత్తంను రికవరీ చేయాలని అధికారులు ఆదేశిం చారు. దీంతో కేవలం 30 వేల రూపాయలు మాత్రమే రికవరీకి జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. నాలుగు పంచాయతీరాజ్ పనులకు రికార్డులు లేనందువల్ల తనిఖీలు చేయలేదు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి గంగాభవానీ, విజెలెన్స్ అధికారి భాగ్య లక్ష్మి, ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, ఎపిఓ కిరణ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**- రూ.30 లక్షల విలువైన బంగారు నగలు, 2 కార్లు స్వాధీనం- ఎస్పీ రిశాంత్‌రెడ్డి**



చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: రాత్రి సమయాల్లో ఇంటి, బ్యాంకు దొంగతనాలకు పాల్పడుతున్న 6 మంది మోస్ట్ వాంటెడ్ అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను బుధవారం పలమనేరు పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుండి పలమనేరు పోలీసులు 30 లక్షల రూపాయల విలువైన బంగారు నగలు, మరో రెండు కార్లను స్వాధీనం చేసుకొన్నారు. చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఎస్పీ రిశాంత్‌రెడ్డి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా చేసిన దొంగతనాల వివరాలను వెల్లడించారు. అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాకు సంబంధించి సమాచారం పలమనేరు సబ్ డివిజన్ పోలీసులకు అందడంతో బుధవారం తెల్లవారుజాము గంగవరం ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర అంతర్‌రాష్ట్ర దొంగలైన రమేష్, గోవిందరాజులు, శ్రీనివాసులు, గనియప్ప, గణేష్, ఆశ్వత్‌నారాయణాలను అరెస్టు చేసి వారి నుండి 30 లక్షల రూపాయల విలువైన 520 గ్రాముల బంగారు అభరణాలు, 5 లక్షల రూపాయల విలులైన 2 కార్లను స్వాధీనం చేసుకొన్నారన్నారు. పోలీసులు వీరిని విచారించగా మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో రాత్రి సమయాల్లో తాళం వేసిన ఇళ్ళను లక్ష్యంగా చేసుకొని తాళాలను పగులగొట్టి ఇళ్ళలోకి ప్రవేశించి దొంగతనాలకు పాల్పడేవారమని అంగీకరించారు. ఈ దొంగల ముఠాకు నాయకుడైన రమేష్ కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో బ్యాంకు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ ముఠా దొంగతనం చేసిన అనంతరం బంగారంను రమేష్, శ్రీనివవాసులు వారి బంధువులకు ఇచ్చి ముత్తూట్ ఫైనాన్స్, ఎటిటిఐసిఎ గోల్డ్ కంపెనీలో విక్రయించి సొమ్ము చేసుకొనే వారని పోలీసు విచారణలో తేలిందన్నారు. పలమనేరు, కుప్పం, పుంగనూరు సర్కిళ్ళ పరిధిలో జరిగిన దొంగతనాలకు సంబంధించి విచారించడానికి డిఎస్పీ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో పుంగనూరు, సదుం, గంగవరం, రామకుప్పం పరిసరాల్లో రాత్రి వేళల్లో జరిగిన దొంగతనాల కేసులను ఛేధించడానికి నాలుగు బృందాలను ఏర్పాటు చేసి కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో విచారణ నిర్వహించారన్నారు. ఈ విచారణలో ఈ ముఠా సభ్యులు ఇళ్ళలోనే కాకుండా బ్యాంకుల్లో సైతం దోపిడిలో చేశారని తేలిందన్నారు. ఈ విలేకరులో సమావేశంలో పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇంటి పట్టాలు మంజూరు : కలెక్టర్

చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త:

జిల్లాలో అక్రిడిటేషన్ కల్గిన జర్నలిస్టుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. కలెక్టరేట్ నుండి బుధవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జర్నలిస్టుల ఇంటి పట్టాల మంజూరుకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించగా కలెక్టరేట్ నుండి డిఆర్ఓ రాజశేఖర్, ఆర్డీఓ చిన్నయ్య, జిల్లా సర్వే ఎడి గౌస్‌భాషా, డిపిఆర్ఓ బి.పద్మజ, తహసిల్దార్లు మురళీమోహన్(చిత్తూరు), రాజేంద్రప్రసాద్ (గుడిపాల) లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ మీడియా సంస్థల్లో పని చేస్తూ 2023 సంవత్సరంలో అక్రిడిటేషన్ కార్డు కల్గిన అర్హులైన జర్నలిస్టులకు ఇంటి పట్టాలు మంజూరుకు ప్రభుత్వం జిఒ జారీ చేసిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 195 ఆన్‌లైన్ దరఖాస్తులు అందాయని, తదుపరి వెరిఫికేషన్ ప్రక్రియ సైతం త్వరితంగా పూర్తి చేస్తామన్నారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఛైర్‌పర్సన్‌గా, కలెక్టర్, డిఆర్ఓ, ఆర్డీఓలు, ముగ్గురు జర్నలిస్టులు సభ్యులుగా డిపిఆర్ఓ కన్వీనర్‌గా కమిటీ ఏర్పాటు అయ్యిందన్నారు. ఈ కమిటీ ఇప్పటికే జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు గుర్తింపు ప్రక్రియ ప్రారంభించిందన్నారు. జనవరి 6వ తేదీ నాటికి ఆన్‌లైన్ దరఖాస్తుల సమయం ముగియనుండటంతో అర్హులైన జర్నలిస్టులు ఆలోపు దరఖాస్తులను చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలన



కుప్పం(రామకుప్పం), డిసెంబర్ 27 ప్రభాతవార్త : మాజీ సిఎం చంద్రబాబు నాయుడు ఈనెల 29న రామకుప్పంలో పర్యటించను న్నారు. ఆరోజు రామకుప్పం బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగి స్తారు. ఈనేపథ్యంలో రామకుప్పంలో అధినేత చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పరిశీలించారు. పార్టీ నేతలకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. పర్యటన విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నేతలు ఆనందరెడ్డి, రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## బెంగళూరులో చంద్రబాబుకు స్వాగత సన్నాహాలు

పాలసముద్రం, డిసెంబర్ 27 ప్రభాతవార్త: జాతీయ తెలుగుదేశం అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు గురువారం బెంగళూరుకు రానుండటంతో ఆయనకు స్వాగతం చెప్పడానికి పాలసముద్రం మండలం నుండి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని తెలుగుదేశం ప్రభావశీలుర గుర్తింపు కమిటీ సభ్యులు భీమినేని చిట్టిబాబు పిలుపునిచ్చారు. పాలసముద్రం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భీమినేని చిట్టిబాబు బుధవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడును వైకాపా ప్రభుత్వం అరెస్టు చేసిన సమయంలో కర్నాటక ప్రజలు ఆయనకు మద్దతుగా నిలబడి భారీ నిరసనలు చేపట్టారని, దీనికి కృతజ్ఞతలు తెలియజేయడానికి చంద్రబాబునాయుడు కుటుంబ సభ్యులతో కలిసి కర్నాటకలోని తెలుగుదేశం నాయకులు, అభిమానులతో సమావేశం కానున్నారన్నారు.

## విఎన్ఆర్ కొత్త సంవత్సర గోడ పత్రికలు ఆవిష్కరణ

గుడిపాల, డిసెంబర్ 27 ప్రభాతవార్త: మండల వైకాపా కార్యాలయంలో బుధవారం ఎపిఆర్‌టిసి వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి ప్రజలకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపే గోడపత్రికలను మండల విఎన్ఆర్ టీమ్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విఎన్ఆర్ టీమ్ సభ్యులు మాట్లాడుతూ ఎంసి విజయానందరెడ్డి నిస్వార్థంతో ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మధు రాయల్, రమేష్, గోపి, నవీన్, ఎంపిటిసీ హరిప్రసాద్‌చౌదరి, చిట్టిబాబు, ఇతర వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## ఆర్థిక బకాయిల సాధనకై యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన పోరుబాట

– డిఇఓ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ధర్నా

చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను సత్వరం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా యుటిఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం డిఇఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే యుటిఎఫ్ నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించిన విషయం తెలిసిందే. ఈ పోరు బాటలో భాగంగా బుధవారం డివిజన్ కేంద్రాల్లో సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు 6 గంటల పాటు డిఇఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయాలని రాష్ట్ర యుటిఎఫ్ నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు బుధవారం యుటిఎఫ్ నాయకులు సోమశేఖర్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి, రెహెనా బేగం, రెడ్డప్పనాయుడు, ఎస్‌పి భాషా, ఏకాంబరం, సరితల ఆధ్వర్యంలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు డిఇఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం సెప్టెంబర్ నాటికే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయి పడ్డ మొత్తంను చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 18 వేల కోట్ల రూపాయలకు పైగా చెల్లించాల్సి వుందని ఈ మొత్తంను సత్వరం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

## శ్రీగంధం స్మగ్లరు అరెస్టు



యర్రావారిపాలెం, డిసెంబరు27 ప్రభాతవార్త : మండల పరిధిలోని చామల పారెస్టు సెక్షన్ పరిధిలో బుధవారం అక్రమంగా శ్రీగంధం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఫారెస్టు రేంజ్ ఆఫీసరు తెలిపిన మేరకు చామల పారెస్టు సెక్షన్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు కలిసి చిన్నగొట్టిగల్లు గ్రామం వద్ద తనికీలు చేశారు. ఈతనికీలలో బజాజ్ ఆటో ఆపకుండా వెళ్లింది. దానిని వెంబడించి ఆపి తనికీ చేయగా అందులో 45 కిలోల శ్రీగంధం పట్టుబడింది. దానితో పాటు సురేంద్ర,నరేంద్ర అనే ఇద్దరిని పట్టుకున్నారు. పట్టుబడిన శ్రీగందం విలువ రూ.1,35,000లు ఉంటుందని అటవీ క్షేత్రాదికారి దత్తాత్రేయ తెలిపారు. ఈదాడుల్లో ఎఫ్ఎస్ఓ తౌపిక్ ఇస్లాం,ఎఫ్‌బీఓ సదాశివయ్య, రాజేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

## చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతోనే అభివృద్ధి

–టీడీపీ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర: థామస్

వెదురుకుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త : చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని గంగాధర నెల్లూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ పేర్కొన్నారు. మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయితీ పరిధిలోని తెట్టుగుండ్లపల్లె, తోటానంపల్లె, దేవళంపేట,మనవర్తికొత్తూరు, తెల్లగుండ్లపల్లె, కొత్తఇండ్లు, ఎస్టీకాలనీలలో మన ఇంటికి మన డాక్టర్ థామస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వం ప్రజల సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైయిందని విమర్శించారు. నవరత్నాల పథకాలు పేరుకు మాత్రమేనని ప్రజలకు శాశ్వతంగా కావలసిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. ప్రజలు 2024లో జరగనున్న ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీకి మద్దతుగా నిలబడి తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి మోహన్ మురళి, నియోజకవర్గం యువత అధ్యక్షులు గురసాల కిషన్‌చంద్, నాయకులు వెంకటరమణ రెడ్డి, దేవరాజుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్ఎంయుపంచే కరపత్రాల పంపిణీ



కుప్పంరూరల్, డిసెంబర్ 27 ప్రభాతవార్త : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అధ్వర్యంలో తమ 58 డిమాండ్లను కరపత్రాల రూపంలో బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేలు, జిల్లా కమిటీ సభ్యులు మొగిలీశ్వ రయ్య, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్‌కుమార్, డిపో కార్యదర్శి జయపాల్, జి.మునెప్ప, గ్యారేజ్ సంఘ నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతరపున రెండు లక్షల ఆర్థికసాయం



కుప్పంరూరల్, డిసెంబర్ 27 ప్రభాతవార్త : కుప్పం మున్సిపల్ బాబు నగర్‌కు చెందిన తెదేపా వీరాభిమా ని కదిరేష్ మృతి చెందాడు. దీంతో పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కదిరేష్ కుటుం బానికి బుధవారం ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంలు రెండు లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జరపాలి

కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త : భారతదేశంలో తొలి ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఏటా జనవరి 3న ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జరపాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాలి సురేష్ కోరారు. అణగారిన వర్గాల అభివృద్ధికి విద్య అనే మార్గానికి ఆమె బాట వేశారన్నారు. బాలికల విద్య కోసం ప్రత్యేక పాఠశాలు ఏర్పాటుచేసిన మహనీయురాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

## యువతలో క్రీడల్ని ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్ర



కుప్పం(రామకుప్పం), డిసెంబర్ 27 ప్రభాతవార్త : యువతలో క్రీడల్ని ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ పద్మిని పేర్కొన్నారు. బుధవారం రామకు ప్పం మండల o బూరుగుకుమాకులపల్లి, అన్నవరం, చెల్దిగాని పల్లిలో ఆమె ఆడుదాంఆంధ్ర క్రీడా పోటీలను ప్రారంభించారు. యువత క్రీడలపై మక్కువ చూపాలనిప్రతిభచూపితేమెరుగైనఅవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమాల్లో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ డైరీ ఆవిష్కరించిన డిఇఓ విజయేంద్రరావు

చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: యుటిఎఫ్ డైరీ –2024, క్యాలెండర్, జిఓ బుక్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు బుధవారం ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని డిఇఓ ఛాంబర్‌లో బుధవారం రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమ శేఖర్‌నాయుడు, ఎన్.మణిగండన్‌ల ఆధ్వర్యంలో డిఇఓ విజయేంద్రరావు డైరీని ఆవిష్కరించారు. ఈ

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మేల్ మరువత్తూరుకు ఉచిత బస్సులు



– పేదల కోసం ఏర్పాటు చేసిన జిజెఎం ట్రస్ట్

చిత్తూరురూరల్, డిసెంబరు 27 ప్రభాతవార్త: చిత్తూరు నియోజకవర్గం, గుడిపాల మండల ఓం శక్తి మాలధారులు తమిళనాడు రాష్ట్రం మేల్‌మరు వత్తూరులోని ఆదిపరాశక్తి అమ్మవారికి దర్శించుకోవడానికి బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలుగుదేశం పార్టీ సీనియరు నాయకులు, జిజెఎం ట్రస్ట్ అధినేత గురజాల జగన్‌మోహన్ తెలిపారు. పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేస్తున్నామని, ఓంశక్తి మాలధారులు తమ మొక్కులను, ప్రయాణాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేసుకో వచ్చునని పేర్కొన్నారు. అలాగే నూతన సంవత్సరం క్యాలెండర్లను చిత్తూరు నియోజకవర్గం, గుడిపాల మండల ప్రజలకు జిజెఎం ట్రస్ట్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులనాయుడు అందరికీ పంచిపెట్టారు.

## ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే విడుదల చేయండి

– టిడిపి అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్

చిత్తూరురూరల్, డిసెంబరు 27 ప్రభాతవార్త: ఆరోగ్యశ్రీ సేవలను 25లక్షలకు పెంచుతామని ప్రగల్భాలు పలికిన మూడు రోజులకే ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్ తమ సేవలను నిలిపి వేస్తామని నోటీసులు ఇవ్వడం ముఖ్యమంత్రి చేతకాని తనానికి నిదర్శనమని టిడిపి అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్ ఎద్దేవా చేసారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్‌కు 1000కోట్ల బకాయి వుండటం దురదృష్టకరమని, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి పెట్టే ఖర్చు ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్‌కు చెల్లించవచ్చు కదా అని ప్రశ్నించారు. తక్షణం ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి వుంటే ఆరోగ్యశ్రీ బకాయిల్ని తక్షణం చెల్లించి పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలు యాధావిధిగా అందించాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలోతవణంపల్లి మండల ప్రధాన కార్యదర్శి మధుయాదవ్, వాణిజ్యవిభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్‌చౌదరి, నియోజకవర్గ రైతు కార్యదర్శి కంచర్లబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైష్ణవీదేవీ ఆలయంలో విశేష పూజలు



పుదిపట్ల(చౌడేపల్లి), డిసెంబర్ 27 ప్రభాతవార్త : మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్లలో వున్న వైష్ణవీదేవీ ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితుడు షణ్ముఖం స్వామిచే ఉదయాన్నే మహాదేవీ, అభయాంజనే యస్వామి, నాగభైరవ స్వామి లకు విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఈనెల 29న ఆలయంలో శాంతి హోమం, గణపతిపూజ, సువాసినీపూజ, సుమంగళి వ్రతం, కుంకుమార్చన, వంటి కార్యక్రమాలు జరుగుతాయనీ, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వినోద్‌కుమార్‌రెడ్డి కోరారు.

## జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచిన నిరంజన్



చౌడేపల్లి, డిసెంబర్ 27 ప్రభాతవార్త : జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ అండర్–14 బాలుర విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరపున ఆడిన చౌడేపల్లి ఉన్నతపాఠశాల విద్యార్థి ప్రతభను కనబరచాడు. చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లికి చెందిన గృహనిర్మాణ కార్మికుడు శ్రీనివాసులు కుమారుడు వసంతపల్లి నిరంజన్ స్థానిక ఉన్నతపాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. సమగ్రశిక్ష ఎస్పీడీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒడిసా రాష్ట్రం భువనేశ్వర్‌లో జరుగుతున్న 67వ జాతీయస్కూల్ గేమ్స్ వాలీబాల్ అండర్–14 విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తృతీయ స్థానం దక్కింది. జట్టులో వున్న వసంతపల్లి నిరంజన్ వ్యక్తిగత ప్రతిభను కనబరచడంతో ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

## కాంట్రాక్టు అవుట్ సోర్సింగు ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపచేయాలి

చిత్తూరురూరల్, డిసెంబరు 27 ప్రభాతవార్త: రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగు ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని కోరుతూ విజయవాడలోని ఏపిజిఇఎస్ రాష్ట్ర ఛైర్మెన్ కాకర్ల వెంకటరమణారెడ్డికి ఏపి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యంప్రసాద్ కలసి వినతి పత్రం అందజేసారు. 2020లో సమగ్ర శిక్షకులుగా పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ ఉద్యోగులకు 33శాతం జీతం పెంచారనీ, అలాగే జనవరి 1, 2023 సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు 23శాతం పెంచుతూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు, కానీ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఐఆర్‌ఆర్‌టిలు, మెసెంజర్లకు మాత్రం జీతాలు పెంచలేదని, దీంతో వీరు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగులకు మొదట పెంచిన 33శాతం, ప్రస్తుతం ప్రకటించిన 23శాతం కలిపి పార్ట్ టైం ఉద్యోగులకు 56శాతం జీతం పెంచి సమన్యాయం చేయాలని డిమాండ్‌చేసారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్రప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కోలాహలంగా ఆడుదాం ఆంధ్రా

– విజేతగా నిలిచిన కేశవరం జట్టు



కోట, డిసెంబర్ 27 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలను కోట మండలం కేశవరం పంచాయతీలో నిర్వహించారు. ఇందులో భాగంగా రెండోరోజు బుధవారం కేశవరం–ఎ, కేశవరం–బి సిద్ధమ్మకండ్రిగ, రాఘవాపురం, కొండుగుండ టీమ్‌లు వాలీబాల్, క్రికెట్‌లో పోటీపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో సిద్ధమ్మకండ్రిగ టీమ్‌పై క్రికెట్‌లో ఆధిక్యత చాటి కేశవరం టీమ్ విజయాన్ని సాధించింది. అనంతరం వాలీబాల్‌లో సిద్ధమ్మకండ్రిగ, కేశవరం టీమ్‌ల మధ్య హోరాహోరీగా జరిగింది. ఇందులో కేశవరం టీమ్ విజేతగా నిలిచింది. రాఘవాపురం కబడ్డీ టీమ్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా చిట్టేడు సొసైటీ మాజీ ఛైర్మన్ ఉలవ కాయల ప్రసాద్, వైసీపీ నేతలు గురుస్వామి మాట్లాడుతూ ఆటల్లో పాల్గొన డమే విజయంగా భావించాలని, ఓటమి చెందితే కుంగిపోకూడదని కోరారు. రాష్ట్రప్రభుత్వం యువతను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. ఎంపిడిఓ భవాని, ఇఓపిఆర్‌డి నయీమ్ తాజుస్సేన్, పిఇటి సందానిబాషా, వలిఅహ్మద్ అంపైర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుబ్బయ్య, ముమ్మడి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌సి, డిఎ అరియర్లను వెంటనే చెల్లించాలి : యుటిఎఫ్

కోట, డిసెంబర్ 27 ప్రభాతవార్త :



రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పాత బకాయిలను పిఆర్‌సి, డిఎలను వెంటనే ఇవ్వాలని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మువ్వల మనోహర్, భాస్కర్‌రావు, బాలసుబ్రహ్మణ్యం కోరారు. బుధవారం సాయంత్రం 6 గంటల పాటు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అధికారంలోకి వస్తే ప్రతినెలా 1వ తేదీన జీతాలు, మెరుగైన పిఆర్‌సి, సకాలంలో డిఎలు ఇస్తామని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి అవేమీ అమలు చేయడం లేదని ఆరోపించారు. సకాలంలో డిఎలు ఇవ్వకపోగా, 1వ తేదీకి జీతాలు ఇవ్వకుండా, 17వ తేదీ వరకు పెన్షన్ల కోసం పెన్షన్‌దారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆర్థిక బకాయిలు ఉద్యోగులకు ఇవ్వకుండా మొండివైఖరి అవలంబిస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తోందన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక బకాయిలపై ఆరుగంటల పాటు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు, నరేష్, బాలాజీ, మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అవే కమిటీలు.. సరికొత్త చిక్కులు

– పదవీ కాలం పొడిగింపుతో సమస్యలు

కోట, డిసెంబర్ 27 ప్రభాతవార్త :

పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ పాలకవర్గాలకు గడువు ముగియడంతో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా వాటి పదవీ కాలాన్ని వచ్చే ఏడాది జూన్ వరకు పొడిగించింది. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సరికొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. ఇప్పటికే ఉన్న ఖాళీలు భర్తీ కాకపోవడంతో చెల్లింపులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలల విలీనం, నాడు–నేడు పనులకు నిధుల సమస్యతో నిర్దేశిత సమయానికి పూర్తి కాకపోవడంతో తరగతి గదుల సమస్య ఏర్పడింది. దీంతో కొందరు పిల్లలు అసౌకర్యాల నడుమ చదువులు సాగిస్తున్నారు. 10వ తరగతి పూర్తి చేసుకొని మరికొందరు వెళ్లిపోయారు. ఇలా వెళ్లిన పిల్లల తల్లిదండ్రుల్లో ఎవరైనా స్కూల్ కమిటీ ఛైర్మన్‌గా, సభ్యులుగా ఉంటే కొత్త వారిని నియమించుకోవాలి. ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున ప్రాథమిక పాఠశాలల్లో 15 మంది, ఉన్నత పాఠశాలల్లో అయితే 24 మందిని పాలకవర్గ సభ్యులుగా ఎన్నుకోవాలి. అయితే రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్కూలు కమిటీ ఎన్నికలు నిర్వహిస్తే గ్రామాల్లో వివాదాలు ఏర్పడతాయన్న భావనతో ప్రభుత్వం కమిటీలకు ఎన్నికలు నిర్వహించకుండా పొడిగించిందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

## రైల్వే సలహాసంఘం సభ్యునిగా బిజెపి నేతలు

సూళ్లూరుపేట, డిసెంబర్ 27 ప్రభాతవార్త :



సూళ్లూరుపేటకు చెందిన బిజెపి నేతలను సదరన్ రైల్వే సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా నియమిస్తున్నట్లు బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి. బిజెపికి చెందిన ముతుకు కోటయ్య గౌడ్, ఆలత్తూరు సుబ్రహ్మణ్యంరెడ్డి, పాశంశెట్టి నిర్మలకుమారి, దుర్గి రమేష్‌కుమార్, పిచ్చిక సూరిబాబులను ఈ కమిటీలో సభ్యులుగా నామినేట్ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు స్థానిక స్టేషన్ మాస్టర్ రంజిత్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రంజిత్‌సింగ్, కమర్షియల్ సూపర్‌వైజర్ ప్రభాకర్, కానిస్టేబుల్ వినోద్‌ను కలిసి వారిని సత్కరించారు. సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు ఏ విధంగా జరుగుతున్నాయని వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సూళ్లూరుపేట నియోజకవర్గ కన్వీనర్ టి.ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే తమను కమిటీ సభ్యులుగా నామినేట్ చేసిన పార్టీ నేతలకు సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్టీసీ డిపోలో కరపత్రాలు పంపిణీ దినోత్సవం

సూళ్లూరుపేట, డిసెంబర్ 27 ప్రభాతవార్త :



సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలోని ఎన్ఎంయు ఆధ్వర్యంలో సమస్యలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసే కార్యక్రమానికి బుధవారం శ్రీకారంచుట్టారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మల్లికార్జునకు, గ్యారేజి సిబ్బందికి ఈ కరపత్రాలను అందజేశారు. ఎన్ఎంయు రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.శేఖర్ మాట్లాడుతూ ఎంతోకాలంగా పరిష్కారానికి నోచుకోకుండా ఉన్న సమస్యలను తమ న్యాయపరమైన డిమాండ్లను కరపత్రాల్లో పొందుపరిచి, వీటిని ఆర్టీసీ అధికారులకు, కార్మికులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అందువల్ల వీటిని కరపత్రాల పంపిణీ దినోత్సవంగా ప్రకటించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేష్, గ్యారేజి సెక్రటరి శశి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సిబ్బంది డిమాండ్లను సిఎం దృష్టికి తీసుకెళ్తా

–వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి, డిసెంబర్ 27 ప్రభాతవార్త :



అంగన్‌వాడి వర్కర్ల డిమాండ్లను సిఎం జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడి సిబ్బంది వెంకటగిరిలోని నివాసంలో రాంకుమార్ రెడ్డిని కలిసి సిబ్బంది వినతిపత్రం అందజేసారు. విగిరి అంగన్వాడీ వర్కర్స్, మీ డిమాండ్లను తనకు చెప్పారని నేను సిఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. డిమాండ్లను పరిష్కరించమని సిఎంకు చెబుతామని అంగన్‌వాడీ సిబ్బందికి తెలిపారు. సామరస్యమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య స్వరూప రాణి, వైసిపి నాయకులు లక్కమనేని కోటిశ్వరరావు, మురళికృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## డీలర్లు సక్రమంగా సరుకులు పంపిణీ చేయకపోతే చర్యలు

బాలాయపల్లి, డిసెంబర్ 27 ప్రభాతవార్త :



సరుకులు సక్రమంగా పంపిణీ డీలర్లపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని రేషన్ షాపుల డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల సరుకులను పంపిణీ చేయాలని సూచించారు. వినియోగదారుల నుండి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు.

## టిడిపి హయాంలోనే పేదల అభివృద్ధి

–మస్తాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మస్తాన్ యాదవ్

వెంకటగిరి, డిసెంబర్ 27 ప్రభాతవార్త :



తెలుగుదేశం ప్రభుత్వంతోనే పేదలకు మేలు జరుగుతుందని మస్తాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టిడిపి నేత డాక్టర్ బోలిగల మస్తాన్ యాదవ్ తెలిపారు. వెంకటగిరి పట్టణ ఎనిమిదో వార్డులో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని గెలిపించుకుంటే అందరికీ చంద్రబాబు నాయుడు భవిష్యత్తు కల్పిస్తారని తెలిపారు. టిడిపి వల్లే పేదలకు మేలు జరుగుతుందని తెలిపారు. 2024లో జరగబోవు ఎన్నికల్లో టిడిపిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానికులకు ఉచితంగా పలు రకాల వ్యాధులకు మందులను ఆయన పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తోట రామచంద్రయ్య, మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికి తీయడమే జగనన్న లక్ష్యం

ఓజిలి, డిసెంబర్ 27 ప్రభాతవార్త :



గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీయడమే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణ లక్ష్యమని జడ్పీటీసీ సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు స్పష్టం చేశారు. బుధవారం ఓజిలి మండలం ఆరిమేనుపాడు సచివాలయం పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను జడ్పీటీసీ సభ్యులు, వైసీపీ సీనియర్ నేత గుంటమడుగు రవీంద్రరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులతో కలిసి జడ్పీటీసీ సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు, సర్పంచ్ తిరుపతి పోలయ్య, ఉప సర్పంచ్ సుకుమార్‌రాజు, ఎంపిటిసి సభ్యులు రఘురామరాజు, వైసీపీ సీనియర్ నేత వెంకటసుబ్బరాజు, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు మధురాజు తదితరులు క్రికెట్ ఆడారు. ఆరిమేనుపాడు హైస్కూలు ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమం పండుగ వాతావరణంలో జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మస్తానయ్య, భూదేవి, ప్రజాప్రతినిధులు, అధికారులు, వాలంటీర్లు, యువత పాల్గొన్నారు.

## సామాన్యుడి అభివృద్ధి ఆమ్ ఆద్మీ పార్టీతోనే సాధ్యం

గూడూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త :



ఆమ్ ఆద్మీ పార్టీ ద్వారానే సామాన్యుడి అభివృద్ధి సాధ్యమవుతుందని గూడూరు నియోజకవర్గ ఆప్ పార్టీ కన్వీనర్ ఎంట్రపాటి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో సామాన్యుడి శంఖారావం ప్రజా చైతన్యయాత్ర 2వ రోజు ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా నియోజకవర్గ కన్వీనర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ ద్వారా మాత్రమే సామాన్యుడు అన్ని విధాలుగా అభివృద్ధి సాధించగలడని పేర్కొన్నారు. దేశంలో నీతి, నిజాయితీకి పెద్దపీట వేసి రెండు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ఘనత ఒక్క ఆమ్ ఆద్మీ పార్టీకి మాత్రమే దక్కుతుందన్నారు. అలాంటి పార్టీ పరిపాలనను మన రాష్ట్రంలోనూ తెప్పించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ సందర్భంగా గూడూరు పాత బస్టాండు వద్ద పార్టీ విధానాలపై అవగాహన కల్పిస్తూ వాలంటరీ మ్యాపింగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా అరికట్ల ఉత్సవం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి జన్మనక్షత్రం ఆరుద్ర రోజు 'ఆరికట్ల ఉత్సవాన్ని'అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవంను ఇలా సాగించారు. ఆలయంలోని కంచుగడప వద్ద వెలసిన వినాయక ఆలయం నుంచి తొమ్మిది దుత్తల్లో నేతిని నింపుకొని పరిచారకులు, అర్చకులు నృత్యాలు,నాట్యాలు చేస్తూ ఆడుతూ పాడుతూ వచ్చారు. మొదట మూడు దుత్తలో నేతిని నింపి నంది విగ్రహం వద్ద చొక్కాణి చెట్టు కాల్చిన చోటకు తీసుకొచ్చారు.అక్కడ నేతి దుత్తలను పగలగొట్టారు.అలా మూడు సార్లు తొమ్మిది దుత్తల్లో నేతితో ఆలయ ఆవరణలో ఉత్సవం నిర్వహించారు. ఇలా చొక్కాణి గుంటలో వేసిన మొక్కలపై నేతిని పోసి హోమాలు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, ఆలయ అర్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్‌లు పాల్గొన్నారు. ఆలయ ఇన్స్పెక్టర్ హరియాదవ్, పర్యవేక్షించారు.ఈ కార్యక్రమాలకు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,సభ్యులు కొండూరు సునీత,పసల సుమతి,లక్ష్మీ,రమాప్రభప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి, పట్టణంలోని నంద మెడికల్స్ అధినేత నరసింహారాజు (నంద) పాల్గొన్నారు. ఆరికట్లఉత్సవం తరువాత స్వామి అమ్మవార్లను పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.

## ప్రభుత్వం పట్టించుకోలేదు... ప్రతిపక్షం స్పందించింది

సూరావారిపల్లి-యార్లపూడి రోడ్డుకు మోక్షం

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 27 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు బాగా దెబ్బతిన్నాయి. అయితే ప్రభు త్వం తుఫాను మరమ్మతులకు సంబంధించి పట్టించుకోలేదని దాంతో ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం స్పందించి రోడ్డును బాగు చేసినట్లు తెలిపారు. గతంలో తుఫానకు మండలంలోని సూరావారిపల్లి- యార్లపూడి రోడ్డు బాగా దెబ్బతిన్నది. రాకపోకలకు అంతరాయంగా మారింది.ఈ సమ స్యను గుర్తించిన తెలుగుదేశం స్పందించింది. మాజీ శ్రీకాళహస్తి మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, మండల నాయకుడు తాటిపర్తి ఈశ్వరరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తాటిపర్తి రవీంద్రరెడ్డి ప్రత్యేకంగా జెసిబిలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి రోడ్డును మరమ్మత్తులు చేపట్టారు.ఈ కార్యక్రమాల్లో యూనిట్ ఇన్‌చార్జి రేవిళ్ళ రమేష్, చంద్రశేఖర్‌నాయుడు, కె.రమేష్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, మనోహర్, రఘునాయుడు, వెంకటరెడ్డి, జే.ఈశ్వర్‌రెడ్డి, సుబ్రమణ్యం, గున్నయ్య, వెంకటసుబ్బయ్య, చంద్రయ్య, మునిరెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్న ప్రసాదానికి గోవా అధికారి విరాళం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరుని బుధవారం దర్శించుకున్న గోవాకు చెందిన ఓ ఐఏయస్ అధికారి కుటుంబ సభ్యులతో కలసి నిత్యాన్న ప్రసాదంలో భోజనం చేసారు.అక్కడ భోజనం చేసిన ఆ అధికారి నిఖిల్ దేశాయ్ రూ.30వేలు విరాళాన్ని అందించారు. విరాళాన్ని ఆలయ పిఆర్ఓ కార్యాలయం అధికారి రవి, సుధీర్ లకు అందించారు.

## శివయ్య సేవలో లోక్ సభ అంచనాల కమిటి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త :



ధార్మిక కేంద్రాలకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేయటానికి లోక్ సభా అంచనాల కమిటి బుధవారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. ఈమేరకు ముందుగానే ఆలయానికి సమాచారం అందించటంతో ఏర్పాట్లు చేశారు. కమిటి చైర్మెన్ సంజయ్ జైస్వాల్,సుదర్సన్ భగత్ మోహన్ కుమార్, కళ్యాన్ జీ,ప్రతాప్ సింహ్, కేశినేని శ్రీనివాస్,ప్రశాంత్ రంజన్ మరో ఐదుగురు అధికారులు హాజరయ్యారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న కమిటికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకఆశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లను డిప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య, సూపరింటెండెంట్ నాగభూషణంలు పర్యవేక్షించారు.

## గ్రామాల్లో సమస్యలను పరిష్కరించండి : జనసేన ఇన్‌ఛార్జి

తొట్టంబేడు, డిసెంబర్ 27 ప్రభాతవార్త :



తొలుత గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వినుత కోట బుధవారం 26వరోజు కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివనాథపాళెం పంచాయతీలో, తొట్టంబేడు పంచాయతీలోని శ్రీరాంనగర్ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రచారాన్ని నిర్వహించి ఉమ్మడి మిని మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రజలకు వైకాపా ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, అవినీతి, అక్రమాలను, దోపిడీలను వివరించారు. రానున్న ఎన్నికల్లో జనసేన టిడిపి ఉమ్మడి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని తద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పేట చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు దండిరాఘవయ్య, ఐటి కోఆర్డినేటర్ కావలికిశోర్, నాయకులు తోటగణేష్, పేట చిరంజీవి, కవిత, శారద, రాజ్యలక్ష్మి, లక్ష్మి, సురేష్, మునెయ్య, గురవయ్య, దినేష్, బత్తెయ్య, మోహన్, తులసి, గోపి, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

## నవసమాజ నిర్మాణం కోసమే వికసిత్ యాత్ర : కోలా

శ్రీకాళహస్తిరూరల్/తొట్టంబేడు, డిసెంబర్ 27 ప్రభాతవార్త



నవసమాజ నిర్మాణం కోసమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర అని అర్హులైన ప్రజలను లబ్ధిదారులుగా మార్చడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఉద్దేశ్యం అని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ అన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు బుధవారం శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలాల్లోని ఉడమలపాడు, మంగళపురి, ఏర్పేడు మండలంలోని అముదూరు, ఏర్పేడు, తొట్టంబేడు మండలంలోని కారాకొల్లు, కంచనపల్లి పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలను సంబంధిత శాఖల అధికారులు మరియు లబ్ధిదారులతో కలిసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అసెంబ్లీ పార్టీ కో కన్వీనర్ మేకా గారు సుబ్రమణ్యంరెడ్డి, కార్యక్రమ కన్వీనర్లు సెంజిగరం వెంకటరమణయ్య, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి చాగణం శైలజ, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, మండలాల అధ్యక్షులు కూనాటి నాగరాజు, వేదాం కృష్ణయ్య, ధర్మారెడ్డి, బొబ్బిలిరెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఈగలబాలాజీ, సుబ్బరామిరెడ్డి, ఆర్కాడువంశీ, రాజశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, మునిరాజ, చొక్కానిరమేష్, కె.వాసు, నాగరాజు, ధర్మయ్యయాదవ్, రామిరెడ్డి, సుందర రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమగ్రశిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ దీక్షలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త :



సమగ్రశిక్ష మరియు జాయింట్ యాక్షన్ కమిటీ తిరుపతిజిల్లాలో ఉన్న 34 మండలాల పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు ఈనెల 16 నుంచి చేపడుతున్న పెన్‌డౌన్ సహాయ నిరాకరణ మరియు 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో భాగంగా ఏడో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా తిరుపతి మండల విద్యాశాఖ అధికారులు సంఘం అధ్యక్షులు టి.లక్ష్మిపతి మరియు రాష్ట్ర ఎంఈవోల సంఘ అధ్యక్షులు బాజ్జి, యర్రావారిపాళెం మండల ఎంఈవో బాలసుబ్రమణ్యం ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. మాజీ ఎంఎల్‌ఏ సుగుణమ్మ దీక్షా శిబిరానికి చేరుకుని సంఘీభావాన్ని తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్నపుడు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ మరియు ప్రభుత్వ శాఖలల్లో పనిచేయు కాంటాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఉద్దేశించి ప్రజాక్షేత్రంలో వస్తే రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ బటన్ నొక్కి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా జనసేన జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ దీక్ష ప్రాంతానికి చేరుకుని వారి సంఘీభావాన్ని తెలిపారు. ఎస్ఎస్‌ఏ ఉద్యోగ సంఘ నాయకులు మరియు జెఏసి యాక్షన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## శివయ్య బిల్వవృక్షాలకు ప్రత్యేకపూజలు

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి, ఐఏఎస్ అధికారి బి.శ్రీధర్ దంపతులు ధనుర్మాస పూజలకు శ్రీకాళహస్తికి విచ్చేసి హోటల్ ఎంజిఎం గ్రాంట్ వెనుక వైపు తోటలో ఉన్న శివయ్యకు ప్రీతిపాత్రమైన రుద్రాక్ష, బిల్వపత్ర మరియు ఉసిరిచెట్లుకు ఎంజిఎం గ్రూప్ ఛైర్మన్ గుడ్లూరుమల్లిఖార్జున్‌నాయుడు మరియు ఎంజిఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరుమయూర్‌తో కలసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

## అగస్తీశ్వరుని ఆలయంలో ఘనంగా ఆరుద్ర పూజలు

నారాయణవనం, డిసెంబర్ 27 ప్రభాతవార్త :



మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్తీశ్వ రుని ఆలయంలో బుధవారం ఆరుద్రపూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేసిన అభిషేకం అలంకరణ చేశారు. అనంతరం శివగామి సమేత నటరాజస్వామిని పుష్పాలతో అలంకరించిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అదికసంఖ్యంలో పాల్గొన్నారు.

## సర్వశిక్షఅభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

-ఆందోళనకారులకు జిల్లా ఎంఈఓలు సంఘీభావం

తిరుపతి,డిసెంబర్ 27ప్రభాతవార్త:



రాష్ట్రంలో విద్యాబోధన విషయంలో అన్ని విధాలా తోడ్పడుతున్న సర్వశిక్షఅభియాన్(ఎస్ఎస్‌సి)ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె న్యాయసమ్మతమని, వీరికి తిరుపతి జిల్లాలోని మండల విద్యాశాఖాధికారుల సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఎస్ఎస్‌సి ఉద్యోగులు డిమాండ్ల సాధనకు శాంతియుతంగా చేపట్టిన నిరసనలో భాగంగా బుధవారం తిరుపతి నగరపాలకసంస్థ కార్యాలయం వద్ద ఆందోళనకారులకు తిరుపతి జిల్లా ఎంఈఓ సంఘం అధ్యక్షుడు టి.లక్ష్మిపతి, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు బాజ్జి, ఎర్రావారిపాళెం మండలం విద్యావాఖాధికారి బాలసుబ్రమణ్యం సమ్మెకు సంఘీభావం తెలియజేసి తమవంతుగా ఒక్కొక్కరు 5వేల రూపాయలు నగదు ఆర్థికసాయం అందించారు. ఎస్ఎస్‌సి ఉద్యోగులు చేపట్టిన పలు రకాల నిరసనలపై ప్రభుత్వం పట్టించుకుని, డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలను బుధవారం మాజీ సిఎం చంద్రబాబునాయుడు, జనసేన నేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను కలసి విన్నవించారు. సమస్యలు పరిష్కారానికి తమవంతు చొరవ తీసుకుంటామని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేందుకు చూస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ నిరసనలో ఎస్ఎస్‌సి నాయకులు, జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పాల్గోన్నారు. తిరుపతిలో టిడిపి నేతలను కలసి మద్దతు కోరారు.

## సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో...

నలుగూరు రమేష్‌బాబు!

బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 27 ప్రభాతవార్త:

2024 సంవత్సరంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సత్యవేడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో నలుగూరు రమేష్‌బాబు, వైసీపీ పార్టీ తరపున పోటీ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం అందుతుంది. కొన్నలి గ్రామానికి చెందిన నలుగూరు రమేష్‌బాబు ఎంఎస్ డబ్ల్యు, ఎల్ఎల్‌బీ చదువుకుని సర్పంచ్‌స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పదవులు అనుభవించే స్థాయికి ఎదిగారు. విద్యావంతుడు, ఆర్థిక బలంగా ఉన్న వ్యక్తి నియోజకవర్గ స్థాయిలో సామాజిక వర్గ బలం, బంధు వర్గం, సత్యవేడు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాల్లో అన్ని వర్గాల వారితో పరిచయాలు పలుకుబడి మెండుగా ఉన్నట్లు తెలుస్తుంది. గతంలో కొన్నలి పంచాయతీ వార్డు మెంబరుగా, ఉప సర్పంచ్‌గా, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా, జిల్లా సర్పంచ్‌ల సంఘం కార్యదర్శిగా పదవులు అలంకరించి అందరి మన్ననలు పొందిన వ్యక్తిగా గుర్తింపు ఉంది. సామాజిక వర్గం, వైసీపీ పెద్దలు నలుగూరు రమేష్‌బాబుకు అండగా నిలుస్తూ సత్యవేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు అధిష్టానం అవకాశం కల్పించాలని సూచించినట్లు కొందరు వ్యక్తుల ద్వారా తెలుస్తుంది. విద్యావంతుడు, రాజకీయ అనుభవం కలిగి, ఆర్థిక బలంగా ఉన్న రమేష్‌బాబుకు అవకాశం కల్పిస్తే అన్ని వర్గాల వారు విజయం కోసం కలసికట్టుగా పని చేసేందుకు ఆయన అనుచరుల వర్గం తెలియజేస్తున్నారు. కానీ అధిష్టానం సత్యవేడు నియోజకవర్గం అభ్యర్థిని ఖరారు చేసేదాకా వేచి ఉండవలసిందే...?

## తి.తి.దే కళ్యాణ క్షురకులకు వేతనం 20 వేలు అభినందనీయం

తిరుపతి,డిసెంబర్ 27 ప్రభాతవార్త:

తిరుమల కళ్యాణకట్టలో పీస్ రేట్ పని చేస్తున్న క్షురకులకు నెలకు 20 వేలు రూపయాలను కనీసం అందించాలని తితిదే నిర్ణయం తీసుకొవడం అభినిందనీయమని తి.తి.దే కళ్యాణ కట్ట సఘం ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్ అన్నారు.ఆయన బుధవారం మాట్లాడుతూ సూమారు 850 కుటంబాలకు ఏంతో మేలు చేసినందుకు ఆయన తితిదే చైర్మెన్ భూమన కరుణకర్‌రెడ్డి, కార్యనిర్వాహణ అధికారి ధర్మారెడ్డికి పాలక మండలి సభ్యులు ,సిద్దవటం యూనాదయ్యలకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## అట్టహాసంగా వాటీబాల్ టోర్నమెంట్

తిరుపతి,డిసెంబర్ 27 ప్రభాతవార్త :

తిరుపతిలో శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న క్రీడా పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఈ పోటీలను మంత్రి రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ మహిళ క్రీడా కారులు అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు.దీంతో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో రాణించాలని ఆమె పిలపునిచ్చారు. ఉపకులపతి డా.డి.భారతి, క్రీడాల్లో పాల్గొన్న క్రిడా కారులను అభినిందించారు. అంతక ముందు 89 విశ్వవిధాయల నుంచి వచ్చిన క్రీడా కారులను ఆమె పరిచయం చేసుకున్నారు. క్రీడలు ఐక్యత చూపడమే కాకుండాస్నేహాలను ప్రతిభింబిస్తునయన్నారు. ఒటిమిని చూసి ఎవరు కుంగి పోకూదన్నారు. ఓటమిని ఒక స్ఫూర్తిగా తీసుకొవాలన్నారు,

## తిరుపతిలో బిజెపి జెండా ఆవిష్కరణ

తిరుపతి,డిసెంబర్ 27 ప్రభాతవార్త :

తిరుపతి నగరంలో బుధవారం బిజెపి అధ్యక్షులు సుబ్బు యాదవ్ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి బిజెపి అధికార ప్రతినిధి భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వర ప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆమలు చేసే సంక్షేమ పధకాలను ఇంటింటికి తీసేకెళ్లాలన్నారు. బూత్ లేవల్ కమిటిలను వేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాక్షులు సుబ్రమణ్యం, యూదవ్, జిల్లా మాజీ కన్వీనర్ గంధం వెంకటముని, కో కన్వీనర్, నాధముని, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దేశాలల్లో...భారత్ ముందు : కలెక్టర్

తిరుపతి, కార్పొరేరేషన్ డిసెంబర్ 27 ప్రభాతవార్త



ప్రపంచ దేశాలల్లో భారతదేశం ముందు వరుసులో ఉండే విధంగా ప్రధానిమంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ వెంకటరణారెడ్డి అన్నారు.తిరుపతిలోని జీవకోన సచివాలయంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో పీయూష్ కుమార్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2047 నాటికి దేశంలోని 30 లక్షల కుటుంబలు 140 కోట్ల జనాభా బాగుండాలని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు.కేంద్ర ప్రభుత్వం సంక్షేమ అభివృద్ది సాధనలో ముందుందన్నారు. అనంతరం పీయూస్ కుమార్ మాట్లాడుతూ వికసిత్ భారత్ యాత్ర దేశ వ్యాప్తంగా చేపట్టనట్లు వివరించారు. సభ అనంతరం ప్రధానమంత్రి మోదీ లైవ్ కార్యక్రమాన్ని ఎల్ఇడిల ద్వారా ప్రజలతో కలిసి వీక్షించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ఏంతోగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, భారత సంకల్పయాత్ర ప్రతిజ్ఞ చేయించారు.

## బృందావన కాలనీ క్రీడాకారులకు కిట్లు పంపిణి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త :



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాల్లో భాగంగా బుధవారం బృందావన్ కాలనీ, జెకేరెడ్డి కాలనీలోని యువ క్రీడాకారులకు క్రికెట్ కిట్లును అందజేసారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో క్రీడాకారులను సమావేశ పరచి కిట్లను అందజేసారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో 28,29 వార్డుల సచివాలయ పరిధిలోని క్రీడాకారులను సమావేశ పరచారు.ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ నేడు యువత చెడుమార్గాల్లో పయనించక ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవనం సాగించటానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని వివరించారు. స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్ఫూర్తిని తీసుకొని శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని క్రీడాకారులను ప్రోత్సహించుటకు క్రికెట్ కిట్‌లను ఇవ్వటానికి సూచించారన్నారు.ఈ కార్యక్రమాల్లో రెడ్డిపల్లి మురళి,పట్టణ యువజన అధ్యక్షులు తలపాదామోదరం రెడ్డి, సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు, పానగల్‌లోని వైకాపా యువత పాల్గొన్నారు.

## నటరాజు, గౌరమ్మ గ్రామోత్సవాలు



శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో బుధవారం ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంది. స్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకత చోటు చేసుకోగా నటరాజస్వామికి అభిషేకాల అనంతరం పట్టణంలోని నాలుగుమాడావీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో షోడషాభిషేకాలు ప్రత్యేక పూజలు అందుకున్న నటరాజును చక్కగా అలంకరించి ఉదయం పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు.ఉత్సవంతో పాటు ఆలయ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు,సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, దఫేదార్ రాజ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అభివృద్ధికి మరో అవకాశం ఇవ్వండి..!

-ఐతేపల్లి అభివృద్ధికి రూ.7.50 కోట్లు

-వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి, డిసెంబర్ 27 ప్రభాతవార్త:



గ్రామీణాభివృద్ధికి విశిష్ట సేవలందించిన చెవిరెడ్డి కుటుంబానికి మరో అవకాశం కల్పించాలని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కోరారు. మండల పరిధిలోని ఐతేపల్లిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిచారు. ఈ కార్యమ్రానికి విచ్చేసిన ఆయన ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎంఎల్ఏ, తుడా చైర్మన్ హోదాలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అయినప్పటికీ మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాల్సి వుందన్నారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని 2024 ఎన్నికలలో ఎంఎల్ఏగా గెలిపించాలని కోరారు. అంతకు ముందు హర్షిత్ రాకను పురస్కరించుకుని సర్పంచ్ ఫాజిల్లా అంజాద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, నాయకులు అగరాల దేవారెడ్డి, మునికృష్ణారెడ్డి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



చంద్రగిరి, డిసెంబర్ 27 ప్రభాతవార్త:

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిం చడంలో దోహదపడగలవని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. అగరాల సమీపంలో ఆడుదాం ఆంధ్రా క్రిడలను నిర్వహిస్తున్నారు. బుధవారం ఇక్కడికి ఇచ్చేసిన మోహిత్ రెడ్డి కొంత సమయం క్రికెట్ ఆడుతూ క్రీడాకారు లను ప్రోత్సహించారు. క్రీడాకారులలో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా మెగా టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడలలో ప్రతిభను సాధించడం ద్వారా భవిష్యత్‌లో మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందగలరన్నారు. క్రీడా స్ఫూర్తితో మెలుగుతూ విజేతలుగా రాణించాలని అన్నారు.

## సార్వత్రిక ఎన్నికల కోసం నిరీక్షణ



-టిడిపి విజయమే లక్ష్యంగా పోరాటం

-టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, డిసెంబర్ 27 ప్రభాతవార్త:

2024 సార్వత్రిక ఎన్నికల కోసం జనం ఎదురు చూస్తున్నారని టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి అన్నారు. స్థానిక కొత్తపేటలో బుధవారం ఆమె మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలకు ప్రభుత్వ దుశ్చర్యలను వివరిస్తూ విసిగిపోయిన జనం ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ప్రతి కార్యకర్త టిడిపి విజయమే లక్ష్యంగా పోరాడాలన్నారు. దొంగ ఓట్లను నమ్ముకున్న వైసిపికి తగిన గణపాఠం చెప్పాలన్నారు. కేవలం మరో మూడు, నాలుగు మాసాలు మాత్రమే వున్నందున ప్రతి ఒక్కరూ ప్రజలతో మమేకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగు సుధ, గౌస్‌భాషా, పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, కొండూరు ప్రవీణ్ రాయల్, లంకెళ్ళ లలిత, శంకర్, డిష్ గోపి, హరి, రాధమ్మ, సునీత, నాయుడమ్మ, మంగాపురం భాస్కర్ రాయల్, గ్యాస్ నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బీచ్ గ్రాప్లింగ్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

వడమాలపేట, డిసెంబరు 28 ప్రభాతవార్త:



విశాఖపట్నం రామకృష్ణ బీచ్ వేదికగా ఈ నెల 29వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న జాతీయ బీచ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు యువ కిషోర్, విశాల్‌లు ఎంపికైనట్లు వడమాలపేట పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచినందుకు గాను వీరికి జాతీయ పోటీలకు అవకాశం లభించింది. యువకిషోర్ 52 కిలోల విభాగంలో, విశాల్ 57 కిలోల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవనీతం, బోధన బోధనేతర సిబ్బంది అభినందించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కబనరచి పతకాలు సాధించాలని తిరిగి రావాలని కోరారు.

## విద్యార్థులకు ట్యాబులు పంపిణీ

వడమాలపేట, డిసెంబరు 28 ప్రభాతవార్త:



జగనన్న విద్యా కానుకలో భాగంగా మండలంలోని పత్తిపుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు స్థానిక జడ్పీటీసీ సభ్యులు మురళీధర్‌రెడ్డి బుధవారం ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ట్యాబులు ఇచ్చారని విద్యార్థులు వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందన్న లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందన్న లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పత్తి పుత్తూరు సర్పంచ్ తులసి, ఎంపీటీసీ ఆవుల ప్రతిమ, ప్రధానోపాధ్యాయులు రెడ్డెయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా మండల సర్వసభ్య సమావేశం

రేణిగుంట, డిసెంబరు 28 ప్రభాతవార్త:



రేణిగుంట ఎంపీడీవోకార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ హరిప్రసాద్ అధ్యక్షతన బుధవారం ప్రశాంతంగా జరిగింది. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమ పరిధిలోని సమస్యలను సభాధ్యక్షుని దృష్టికి తీసుకెళ్లారు. ఆయా శాఖల అధికారులతోసమస్యలను దాదాపు అక్కడే పరిష్కరించారు. పాలసీ సమస్యలను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీవో విష్ణు చిరంజీవి, జడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, సింగిల్‌విండో చైర్మన్ గణేష్, మండల సచివాలయాల కన్వీనర్ డా. గంగారి రమేష్, మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట తప్పరు : పవిత్రరెడ్డి



**రేణిగుంట, డిసెంబరు 28 ప్రభాతవార్త:** తన తండ్రి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట ఇస్తే తప్పరని రేణిగుంట మండల వైసీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రరెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్ట బీసీ కాలనీలో 30 సంవత్సరాలుగా కాపురం ఉంటున్న 149 కుటుంబీకులకు పవిత్రరెడ్డి ఇంటిపన్ను రసీదులను బుధవారం అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా దొడ్లమిట్ట బీసీ కాలనీకి చెందిన 149 కుటుంబాలు తమకు ఇంటి పన్నులు ఇప్పించాలని ఎమ్మెల్యేని కోరారు. అంగీకరించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో చర్చించి అభ్యంతరాలు లేకుండా చేసి పంచాయతీ అధికారులతో మాట్లాడి ఇచ్చిన మాట ప్రకారం ఇంటి పన్ను రసీదులను మంజూరు చేయించారు. వీటిని ఎమ్మెల్యే కుమార్తె పవిత్రరెడ్డి అందజేశారు. పన్ను రసీదులు అందుకున్న కుటుంబాలు ఆమెను ఘనంగా సత్కరించి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపి అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ ఈశ్వరమ్మ, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, స్థానిక ఎంపీటీసీలు శ్రావణి, కన్నయ్య, పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ ఖాన్, వార్డు మెంబర్లు సుబ్రహ్మణ్యం, పార్థసారథి, చంద్రమౌళి, సుబ్రహ్మణ్యం, సచివాలయ కన్వీనర్లు బాబు, శివకుమార్, తులసిరాం, స్థానికులు పాల్గొన్నారు.

## శ్రీవల్లిదేవసేన సమేత శ్రీ షణ్ముఖ స్వామి ఊరేగింపు

పుత్తూరురూరల్, డిసెంబరు 27 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆరుద్ర ఉత్సవ సందర్భంగా శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ షణ్ముఖ స్వామి పురవీధుల్లో ఊరేగించారు. శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి మహా అభిషేకాలు, అలంకరణలు చేశారు. బుధవారం ఉదయం మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పురవీదుల్లో ఊరేగించారు. ఉభయ దారులు చిట్టమూరురమేష్‌బాబు,చిట్టిమూరుధనలక్ష్మి, చిట్టమూరు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## వ్యాసరచన పోటీల్లో విద్యార్థులకు బహుమతుల ప్రధానం

**నారాయణవనం, డిసెంబర్ 27 ప్రభాతవార్త :** పరమేశ్వరమంగళంలోని శ్రీ చైతన్య పాఠశాల-2 విద్యార్థులకు గత నెలలో విజయవాడ వీజేఆర్ డయాబెటీస్ వారు నిర్వమించి వ్యాస రచన పోటీల్లో తమ ప్రతిభను కనపరిచి మొదటి,రెండవ, మూడు స్థానాలను కైవసం చేసుకొని బహుమతులను అందుకోవడం జరిగిందని ప్రిన్సిపాల కె గోపి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలకు డయాబెటీస్‌పై అవగామన కల్పించడం వల్ల ఆహార నియమాలు, ఆరోగ్య విషయాలపై తగు జాగ్రత్తలు పాటిస్తూ జీవించడమే కాకుండా తమ తల్లితండ్రులకు, సమాజంలోని ప్రజలకు తెలియజేస్తారన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఎజిఎం సురేష్ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక కో ఆర్డినేటర్ బాలాజీ, డీన్ సంపత్‌కుమార్, టెన్త్ విభాగం ఇంచార్జీ శివ, సీ బ్యాచ్ ఇంచార్జీ వినోద్‌కుమార్, ఇంచార్జీలు సౌమ్య, నగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే సిఎం లక్ష్యం: నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి




వెంకటగిరి, డిసెంబర్ 27 ప్రభాతవార్త : సిఎం జగన్మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 14వ వార్డు బొగ్గుల మిట్టలో ఆయన మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. చేనేత కార్మికుల 24 వేల రూపాయిలు నేతన్న నేస్తం ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన

## పేదల సంక్షేమమే సిఎం లక్ష్యం: నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

హామీలన్నిటిని సిఎం నెరవేర్చినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వాన్ని మరల అందరూ ఆదరించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను సిఎం జగన్మోహన్ రెడ్డి నేరుగా ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సిఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను పేదలకు ఇస్తున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడ అమలు కావడం లేదన్నారు. పేదలు ఆనందంగా జీవించాలని సిఎం నవరత్నాల పథకం పేరుతో విరివిగా సంక్షేమ పథకాలు ఇస్తున్నట్లు చెప్పారు. డ్రైనేజీ కాలువ లేనందువల్ల ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు సమస్యలను రాంకుమార్ రెడ్డి దృష్టికీ తీసుకెళ్లగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతు శారత, వైసిపి జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, గోపాలకృష్ణ, సుబ్బారావు, నారాయణ, కళ్యాణి, పూజారి లక్ష్మి, నాయకులు, లక్కమనేని కోటేశ్వర రావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని ఆర్టీసి సర్వీసులు

-రోగులు, ప్రయాణీకులకు తప్పని ఇక్కట్లు

**సత్యవేడు, డిశంబరు 27, ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాకు మారుమూల ప్రాంతమైన సత్యవేడు ప్రాంత ప్రజలకు, ఆర్టీసి డ్రైవర్లు, కండక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఇబ్బందులు తప్పడంలేదు. సత్యవేడు ఆర్టీసి డిపో నుండి 48 బస్సు సర్వీసులను నిర్వహిస్తున్నారు. ఈప్రాంత వాసులు మెరుగైన వైద్య చికిత్సలు పొందాలన్నా, జిల్లా ప్రభుత్వ అధికారుల కార్యాలయాలకు వెళ్ళాలన్నా ఆర్టీసి బస్సులపైనే ఆధారపడాల్సి ఉంది. ఇలాంటి నేపథ్యంలో ఆర్టీసి డ్రైవర్లు, కండక్టర్లు ప్రజారవాణా వ్యవస్థ విలువలను కాపాడుతూ ప్రజలకు సేవలను అందించాల్సి ఉండగా అందుకు భిన్నంగా వారి వ్యవహారి ఉండటంతో స్థానికులు మండిపడుతున్నారు. బుధవారం ఉదయం సత్యవేడు ఆర్టీసి బస్టాండ్‌లో వళ్ళియమ్మ(65) తిరుపతి హాస్పిటల్‌కు వెళ్ళేందుకు బస్సు కోసం వేచియున్నది. అలాగే మిగిలిన ప్రయాణీకులు కూడా తిరుపతి ప్రయాణించే బస్సు కోసం వేచిఉన్నారు. ఆర్టీసి డిపో నుండి బయల్దేరిన తిరుపతి ఆర్డినరీ సర్వీసు బస్సు నెం.ఏపి39జడ్0259 బస్టాండ్ వద్ద ఆపకనే పదినిమిషాలు ముందుగా వెళ్ళిపోయింది. అందులో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్ ఏకె రెడ్డి, కండక్టర్ ఎఎం క్రిష్ణలు ఇక్కడ వేచిఉన్న ప్రయాణీకులను చూసి కూడా కావాలనే బస్సు ఆపకుండా వేగంగా వెళ్ళిపోయారని రోగులు, ప్రయాణీకులు చెపుతున్నారు. సత్యవేడు ఆర్టీసి బస్సుల తీరు గతకొద్ది రోజులుగా ఇదేవిధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రయివేట్ బస్సు సర్వీసులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆర్టీసి బస్సులు ఆపకుండా టిక్కెట్‌లను వారి సర్వీసులకు మళ్ళిస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సత్యవేడు ఆర్టీసి డిపోకు ఆదాయం తగ్గినా, సర్వీసుల పునరుద్ధర లేకున్నా,ప్రజలు తరచూ వినతులు చేస్తున్నా అంతర్గతంగా ప్రజారవాణా వ్యవస్థలో లోపాలను సరిదిద్ది ప్రగతిపథంలో నడపాల్సిన డిపో మేనేజర్ వెంకటరమణ చర్యలు చూపకపోవడంపై ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపి ఆర్టీసి డ్రైవర్లు, కండక్టర్‌లు నిర్లక్ష్యవైఖరిపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## అలరిస్తున్న 'ఆడుదాం-ఆంధ్ర'

దేశంలోనే అతిపెద్ద టోర్నీ 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమం

- తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



**తిరుపతిరూరల్, డిసెంబర్27 ప్రభాతవార్త:** గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమం యువత ఉత్తేజాన్ని రేకిస్తుందని తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆడుదాం-ఆంధ్ర రెండో రోజున తిరుపతిరూరల్ మండలం మంగళం, తిరుచానూరు, కొత్తూరు, చంద్రగిరి మండలాల్లో జరిగిన ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని తుడ చైర్మెన్ పర్యవేక్షించారు. క్రీడాకారులకు క్రీడా కిట్స్‌ను అందజేసారు. తుడ చైర్మెన్ స్వయంగా క్రీడా మైదానాల వద్దకు వెళ్ళి క్రీడాకారులను పరిచం చేసుకున్నారు. గెలుపు ఓటమిలు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని సూచించారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికి దోహదపడతాయని సూచించారు. ఆరోగ్యకరమైన వాతావరణానికి క్రీడలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి. ఎంపిడిఓ కనపర్తి రమేష్‌బాబు, వైకాపా యువ నాయకులు చిలమంద హరికృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను కలిసిన తుడ చైర్మెన్ మోహిత్‌రెడ్డి




**తిరుపతిరూరల్, డిసెంబర్27 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను తిరుపతి పట్టణాభివృ సంస్థ(తుడ) చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. జె.సి. బన్సల్‌ను దుశ్శాలవతో ఘనంగా సత్కరించారు. పరిష్కారానికి నోచుకోని రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. వెంకటపతినగర్‌లో ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకొని సమస్యను పరి ష్కరించి, పేదలకు పట్టాలు అందించిన విషయాన్ని జె.సి.కి వివరించారు. మంగళం పరిధిలో అర్హులకు పట్టాలు అందించే విషయమై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే చెవిరెడ్డి చొరవతో మంగళం లబ్దిదారులకు ఇంటి పట్టాలు పంపిణి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 12 వరకు క్షేత్ర స్థాయిలో క్లైయిముల విచారణ

- జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్

చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త: ఓటరు నమోదు కోసం డిసెంబర్ 9వ తేదీ వరకు అందిన క్లైయిములపై జనవరి 12వ తేదీ వరకు క్షేత్ర స్థాయి విచారణ జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ అన్నారు. డిఆర్‌ఓ కార్యాలయంలోని సమావేశమందిరంలో బుధవారం డిఆర్‌ఓ రాజశేఖర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితా జనవరి 22వ తేదీను విడుదల చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 1,762 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మౌలిక వసతులకు సంబంధించి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందని, రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించుకోవచ్చునన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు లేఆ తీసివేతలకు సంబంధించి ఎలాంటి అనుమానాలు వున్న కలెక్టర్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో పరదేశి(కాంగ్రెస్), లోకేష్(ఆమ్ ఆద్మీ పార్టీ), ఎలక్షన్ సూపరిటెండెంట్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో రహస్యపాలన!



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరుని పాలన రోజు రోజుకు అధ్వాన్నంగా మారుతుంది. ప్రభుత్వం ఈ ఆలయానికి రెగ్యూలర్ ఇఒను నియమించక పోవటంతో ఆలయ పరిపాలన అస్తవ్యస్తంగా మారుతుంది. ఇన్‌చార్జి అధికారి ఇక్కడ ఉన్నపుడు పరిపాలన పారదర్శకంగా కనబడుతుంది. మిగిలిన రోజుల్లో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు మారుతుంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి కేవలం 40కిలో మీటర్ల దూరంలో దేవాదాయశాఖకు సంబంధించిన అధికారులు ఉండగాప్రభుత్వం ఎక్కడే 400 కిలోమీటర్ల దూరంలోని దుర్గామల్లేశ్వరాలయం అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన వారంలో మూడు రోజులు ఇక్కడ నాలుగురోజులు అక్కడ ఉంటున్నారు.

**మీడియా మీద ఆంక్షలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో గత నాలుగేళ్ళుగా ఎందుకో మీడియా మీద ఆంక్షలు విధించారు. అయితే చర్చల తరువాత ఇఓగా భ్రమరాంబ ఉన్నపుడు అలంకార మండపం గురుదక్షిణామూర్తి ఆలయం వరకు అనుమతించారు.మళ్ళీ రెండు సంవత్సరాల నుంచి పూర్తిగా ఆంక్షలు విధించారు. ఎందుకో ఆలయాధి కారులకు మీడియా మీద ఆంక్షలు కఠినతరం చేసారు. ఈ సమస్యకు సంబంధించి ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తెచ్చారు. ప్రస్తుతం ఆలయానికి వివిపిలు వచ్చినా సమాచారం ఇవ్వటానికి ఎందుకో సుముఖంగా లేదు. ఏం జరుగుతున్నా మీడియా ప్రచురించకూడదు. ఆలయంలో భక్తులను దళారులు నిలువుదోపిడికి గురౌతున్నారు.కానీ పట్టించుకునే దిక్కులేదు. ధర్మకర్తల మండలి ఉన్నా పట్టించుకునే స్థితిలో లేదు. కానీ నేడు లెక్కలేనంత మంది పిఆర్‌ఓలున్నారు.కానీ ఆలయానికి సంబంధించిన సమాచారం ఇవ్వటంలో విఫలమౌతున్నారు. మరో రెండు నెలల్లో మహాశివరాత్రి తరుముకొస్తుంది. అధికారులు తీరుమారకుంటే ఎలా అనే చర్చ చోటు చేసుకుంది.

## జీతాలు పెరిగే వరకు పని సాగదు: ఎంఎల్‌ఏ కార్యాలయ ముట్టడి



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 27 ప్రభాతవార్త :** ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు అంగన్‌వాడి తలుపులు తెరుచుకోవని పని సాగదని బుధవారం శ్రీకాళహస్తి ఎంఎల్‌ఏ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీలు స్పష్టం చేసారు. కార్యాలయంలో ఎంఎల్‌ఏ అందుబాటులో లేనందువల్ల వారు తమ డిమాండ్లను ఆయన కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డికి అందించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిధిగా ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షుడు రామిశెట్టి వెంకయ్య హాజరయ్యారు .రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడ్లూరు భారతి అధ్యక్షతన రాష్ట్ర కమిటి పిలుపు మేరకు బుధవారం ఎంఎల్‌ఏ కార్యాలయ ముట్టడి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.అయితే ముందుగానే కార్యాలయం వద్ద పోలీసులు మొహరించారు. గట్టి బందోబస్తును ఏర్పాటు చేసారు.ఐఎఫ్‌టియు,సిఐటియు,ఏఐటియుసిల అనుబంధ అంగన్‌వాడీ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామిశెట్టి వెంకయ్య మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నపుడు అంగన్‌వాడిల మద్దతు కోసం సమస్యలు తాను విన్నానని మీకు తోడుగా నేనున్నానని అరచేతిలో స్వర్గం చూపారన్నారు. ఇప్పుడు తనకేమి తెలియనట్లు వ్యవహారిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుడ్లూరుభారతి మాట్లాడుతూ నేడు ప్రభుత్వం ప్రచారాలకు పెడుతున్న ఖర్చులో ఏ కొంత అయినా కేటాయించిన అంగన్‌వాడీల సమస్య పరిష్కారమౌతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు నాయకులు పుల్లయ్య, గురవయ్య, అంగన్‌వాడి హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు కల్పన, కార్యదర్శులు శోభ,స్వర్ణ,రాజ్యం,మణిశ్రీ, మాధవి, భారతి,రాధమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి

**తిరుపతి టౌన్ 27 ప్రభాతవార్త**

ప్రవేటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల నడుస్తున్నాయని తితిదే చైర్మెన్, తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు.బుధవారం నెహ్రూ మునిసిపల్ హైస్కూల్‌లో ఉచిత ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాడు నేడు కింది రూ 50 వేల కోట్ల రూపాయాలతో జగనన్న ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని గోప్ప ఆలోచనలతో పాలన అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.దృఢ సంకల్పం కలిగిన మహా నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ హరిత, నగరపాలక సంస్ధ మేయర్ శిరీష్,కార్పొరేటర్ బసవ గీత డిఇఈ రాజశేఖర్, ఎంఇఒ బాలాజీ, నాయక్,తదితరుల పాల్గొన్నారు

## నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా చేసుకోవాలి

**వరదయ్యపాళెం,డిసెంబర్ 27 ప్రభాతవార్త**

డిసెంబర్ 31 న 2023కు వీడ్కోల్ పలకుతూ 2024న స్వాగతం పలుకే క్రమంలో మండలంలోని యువత నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ నాగార్జున్ రెడ్డి కోరారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ మదనయం సేవించి డ్రైవ్ చేస్తూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.ఇతరలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే బాగుండదన్నారు.

## జనసేన లో చేరిన బంజారా జనసంఘ్ నాయకులు

**తిరుపతి,కార్పొరేషన్,డిసెంబర్ 27 ప్రభాతవార్త**

తిరుపతిలోని బుధవారం బంజారా జనసంఘ్ నాయకులు చిత్తూరు జిల్లా అధ్యక్షులు డా.పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు.బంజారా జన సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్‌నాయక్, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ నాయక్, జిల్లా అధ్యక్షులు విజకుమార్ నాయక్‌తో పాటు పలువురు జనసేనలో చేరారు. తిరుపతి జిల్లాలో జనసేన రోజు రోజు బలపడుతుందన్నారు.జనసేన బలపర్చిన అభ్యర్ధిని గెలిపించుకొంటామని హరి ప్రసాద్ చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షులు బత్తిన మధుబబు, సుభాషణి, ఆకుల వనజ, ఆనంద్, బాబ్జి, రాజారెడ్డి, లక్ష్మీ, దినేష్‌జైన్. రాజేష్, చరణ్‌రాయల్, కిరణ్ కుమార్, గౌస్ బాష జన సైనికులు రవి, మోహిత్, ఇంద్ర, బాలజీ, దుర్గ లక్ష్మి, తదితరులుపాల్గొన్నారు.

# కుప్పంలో చంద్రబాబు పర్యటన వివరాలు



కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త : ప్రతిపక్ష నేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు నేటి నుంచి మూడు రోజులపాటు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు.. చంద్రబాబు పర్యటనకు సంబంధించిన వివరాలిలా.. 28వతేది గురువారం హైదరాబాదునుంచి బెంగళూరుకు విమానంలో 10.40గంటలకు చేరుకుంటారు. ఉదయం 11.30గంటలకు బెంగళూరులో నియోజకవర్గ కార్యకర్తల సంక్షేమ విభాగం అధ్యక్షుడు డిఎస్ త్రిలోక్‌ను పరామర్శిస్తారు. 12.15నుంచి 1గంట వరకు బెంగళూరు టిడిపి ఫోరం సమావేశంలో పాల్గొంటారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి కర్ణాటక లోని కోలారు, కెజిఎఫ్ మీదుగా గుడుపల్లె మండలకేంద్రానికి సాయంత్రం 4గంటలకు చేరుకుంటారు. అక్కడ బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడనుంచి కుప్పం పార్టీ కార్యాలయంకు సాయంత్రం 6గంటలకు చేరుకుని కార్యకర్తలతో సమావేశమవుతారు. అనంతరం తన వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శిస్తారు. అక్కడ నుంచి ఆర్అండ్‌బి అతిథిగృహం చేరుకుని బస చేస్తారు. 29న ఉదయం అతిథిగృహంలో ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం మధ్యాహ్నం 11.50నుంచి 1.30గంటల దాకా శాంతిపురంలో జరిగే బహిరంగసభలో ప్రస ంగిస్తారు. అనంతరం 3గంటలనుంచి 4.30గంటల దాకా రామకుప్పంలో జరిగే బహిరంగ సభలో బాబు ప్రసంగిస్తారు. అనంతరం కుప్పం చేరుకుని 5గంటలనుంచి 6గంటల దాకా జనసేన కార్యకర్తలతో సమావేశమవుతారు. సాయంత్రం బిసిఎన్ గ్రాండ్ హోటల్‌లో 6.15నుంచి 8.15గంటల దాకా కార్యకర్తలతో సమావేశం జరుపుతారు. 30వతేది ఉదయం :గృహంలో ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం 12.20గంటలకు పిఇఎస్ వైద్య కళాశాల సమీపంలో శ్రీ కనకదాస విగ్రహంను ఆవిష్కరించి అక్కడ ప్రసంగించనున్నారు. అక్కడనుంచి కుప్పం బస్టాండులో అన్న క్యాంటీన్‌ను 2.30గంటలకు సందర్శిస్తారు. 2.45గంటలనుంచి 3గంటల వరకు కొత్తపేటలో వెలసిన శ్రీ ప్రసన్న పెద్దపులి గంగమ్మ ఆలయం, 3.30గంటల నుంచి 4గంటల వరకు కొత్తపేట మసీదులను సందర్శిస్తారు. అనంతరం 4.30గంటలకు మల్లానూరు చేరుకుని అక్కడ బహిరంగసభలో ప్రసంగిస్తారు. పచ్చూరు, కృష్ణగిరి మీదుగా బెంగళూరు చేరుకుంటారు.

## నాయకులను బైండోవర్ చేసే అధికారం పోలీసులకు లేదు

- మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

**గూడూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త :**



టీడీపీ నాయకులను బెండోవర్ చేసుకునే అధికారం పోలీసు అధికారులకు లేదని గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గత రెండురోజులుగా పోలీసు అధికారులు టీడీపీ నాయకులను బైండోవర్ చేసుకుంటామని వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు వ్యవస్థపై ఉన్న నమ్మకంతో ఈ ప్రాంతంలోని టిడిపి నాయకులు 2010వ సంవత్సరంలో సంతకాలు చేశారని, దాన్ని ఆసరాగా తీసుకొని పోలీసు అధికారులు ప్రస్తుతం టిడిపి నాయకులను బైండోవర్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బైండోవర్ చేసుకునే అధికారం పోలీసులకు లేదని, కేవలం తహశీల్దార్లకు మాత్రమే ఉందని తెలిపారు. ఈ మేరకు న్యాయస్థానాలు తీర్పు వెల్లడించాయని తెలిపారు. అయితే మండల స్థాయిలో పోలీసు అధికారులు టిడిపి మండల నాయకులకు ఫోన్ చేసి ప్రతి పంచాయతీ నుంచి పదిమందిని తీసుకొచ్చి బైండోవర్ చేయాలని నాయకులను వేధిస్తున్నారని తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. అవసరమైతే తాము ఎలక్షన్ కమిషన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## గంగమ్మకు వెండి మకరతోరణం వితరణ

**బోయకొండ(చౌడేపల్లి), డిసెంబర్ 27 ప్రభాతవార్త :**



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు దాత వెండి మకరతోరణాన్ని విరాళంగా అందించాడు. బుధవారం ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళిలకు బెంగళూరుకు చెందిన ఎస్.సంజీవ్ రూ. 12లక్షలు విలువ చేయు వెండితో తయారు చేయబడ్డ మకరతోరణాన్ని అందజేశారు. దాతతో సహా అతని కుటుంబ సభ్యులను సాదరంగా ఆహ్వానించి, అమ్మవారి దర్శనభాగ్యం తర్వాత పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప పడికట్ల పూజలు

**సదుం,డిసెంబరు27 ప్రభాతవార్త :**



మండల పరిధిలోని యర్రాతివారి పల్లెలోని బురుజుబం డపై వెలసిన శ్రీఅయ్యప్పస్వామి వారి ఆలయంలో బుధవారం పడికట్ల పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల విద్యుద్దీపాలు, పలురకాలైన పూలతో అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలోప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన మేల్‌తంత్రి ప్రత్యేకంగా అలంకరించిన పడిమెట్లకు వివిధ రకాల సుగంధ ద్రవ్యాల నీటితో ప్రత్యేంగా అభిషేకం చేశారు. అనంతరం ప్రతి మెట్టుకు మంత్రోచ్చారణల నడుమ పూజలు చేసి కర్పూర హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఆలయ ధర్మకర్త పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణమ్మ, కుటుంబసభ్యులు తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి , పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, తదితరులతో పాటు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, మండల వైకాపా నాయకులు రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మనోహరరెడ్డి, శివశక్తి డెయిరీ మేనేజరు పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు. భక్తులకు నిరంతరాయంగా అన్నదానం నిర్వహించారు. సదుం ఎస్సై మారుతి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## ఘనంగా బిసి నాగరాజ్ జన్మదిన వేడుకలు

- పెద్ద ఎత్తున అన్నదానం .. రక్తదాన శిబిరాలు.. క్రీడాసామగ్రి వితరణ !!

**కుప్పం, డిసెంబర్ 27 ప్రభాతవార్త :**



కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ ఛైర్మన్, బిసిఎన్ గ్రూప్స్ అధినేత బిసి నాగరాజ్ జన్మదిన వేడుకలను బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కెఇసి విద్యార్థులు రక్తదానం చేశారు. అలాగే పెద్ద ఎత్తున శెట్టిపల్లి బధిర పాఠశ్యాలలో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గుడుపల్లె మండలంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలకు వాటర్ గ్రీజర్, కుట్టుమిషన్, పరీక్షా సామగ్రి అందించారు. అలాగే పలు ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సామగ్రిని అందించారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినులకు తాము అండగా ఉంటామని విద్య పరంగా ఎలాంటి సహాయ సహకారాలు అయినా అందిస్తామని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, ఆయన కుమారులు వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఓ సాగర్‌రాజ్ పేర్కొన్నారు. సంస్థల్లో పనిచేసే సిబ్బంది 410మందికి 20.5కోట్లతో భీమా సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఓ మాధవి, లయన్స్‌క్లబ్ జోనల్ అధ్యక్షుడు డా॥ మహేష్, కెఇసి ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ప్రిన్సిపాళ్ల సుధారాణి, విమల, సుప్రియ, హెచ్ఎం ప్రియ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నివాసంను ముట్టడించిన అంగన్‌వాడీలు

**చిత్తూరు, డిసెంబర్ 27 ప్రభాతవార్త:**



ప్రభుత్వం చర్చల పేరిట అంగన్‌వాడీ కార్యర్తలను మోసం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంటిని ముట్టడించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముట్టడికి ముందే వెలుపలికి వెళ్ళిపోవడంతో ఎమ్మెల్యే ఇంటికి వచ్చే వరకు పోరాటం సాగిస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు భీష్మించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు నాగరాజు మాట్లాడుతూ గ్రాట్యూటీ విషయంలో కోర్టును ఆశ్రయించాలని చెప్పడం సిగ్గుచేటు అని, కోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయకుండా కోర్టుకు వెళ్ళమనడం బాధ్యతా రాహిత్యమని ధ్వజమెత్తారు. గత 16 రోజులుగా సమస్యలపై అంగన్‌వాడీలు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నా ఇప్పటి వరకు ఈ సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్ళకపోవడం శోచనీయమన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం సాగిస్తామని జనవరి 3న కలెక్టరేట్ల ముట్టడిని భారీ ఎత్తున నిర్వహిస్తామని ఆయన అల్టిమేటం జారీ చేశారు. ఈ కార్యక్రమం అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ప్రభావతి, నాయకులు సుభాషిణి, సుజిని, బాలసుబ్రమణ్యం, రమాదేవి, గోపినాథ్, మణి పాల్గొన్నారు.

## ప్రజల నమ్మక ద్రోహి సిఎం వైఎస్ జగన్

- పూతలపట్టు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జీ డాక్టర్ మురళీమోహన్

**బంగారుపాళ్యం, డిసెంబర్ 27 ప్రభాతవార్త:**




రాష్ట్ర ప్రజల నమ్మక ద్రోహిగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని పూతలపట్టు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జీ డాక్టర్ మురళీమోహన్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం ఒక ఛాన్స్ ఇవ్వండి అంటూ ప్రజలను ప్రాధేయపడిన సిఎం వైఎస్ జగన్ అధికారం వచ్చాక ప్రజా సమస్యలను విస్మరించారని ఆరోపించారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో వస్తున్న వైకాపా నాయకులు ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక తిరుగుముఖం పడుతున్నారని ఎద్దేవా చేశారు. తండ్రి లాంటి పిన తండ్రి హత్యకు గురైనా ఇప్పటి వరకు ఆ కేసు విషయంపై స్పందించని సిఎం వైఎస్ జగన్‌కు ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. అలాగే తల్లి, చెల్లెలును ప్రక్క రాష్ట్రాలకు తరిమిన సిఎం వైఎస్ జగన్ ప్రజలకు ఏం సమాధానం చెప్తారని నిలదీశారు. అలాగే అధికారం చేపట్టిన వెంటనే మద్యపాన నిషేధం చేస్తానని హామీ ఇచ్చిన సిఎం వైఎస్ జగన్ ఇప్పటి వరకు ఆ హామీ అమలు చేయలేదన్నారు. ఈ విధంగా పలు విషయాల్లో ప్రజల నమ్మకంను విస్మరించిన సిఎం వైఎస్ జగన్ మరోమారు అధికారం కోసం తప్పుడు హామీలు ఇవ్వడానికి సిద్ధంగా వున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు కోకా ప్రకాష్‌నాయుడు, మండల టిడిపి కార్యదర్శి జనార్ధన్‌గౌడు, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ హేమచంద్రనాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.